

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్


చేనేత రంగానికి ఊతం

- ఉచిత విద్యుత్‌కు ప్రభుత్వం శ్రీకారం
- పట్టుచీరల తయారీలో తగ్గనున్న ఖర్చులు
- చేనేత రంగానికి నెలకు రూ.1.74 కోట్ల సబ్సిడీ
- చేనేత దినోత్సవం రోజున ప్రకటించనున్న సీఎం



మదనపల్లెలో చేనేత మగ్గం నేస్తున్న కార్మికుడు

చేనేత పరిశ్రమలో పెట్టుబడులు, చీరల తయారీకి ముడిసరుకుల ధరలు ఆకాశాన్నంటి చేనేత పరిశ్రమ కుదేలవుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగాన్ని ఆదుకునేందుకు కొత్త పథకం తీసుకురానుంది. చేనేత రంగంలో చేతిమగ్గాలకు, పవర్‌లూమ్స్‌కు ఉచిత విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. చేనేత మగ్గాలకు 200 యూనిట్ల వరకు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈనెల 7వ తేదీ నిర్వహించనున్న చేనేత దినోత్సవం రోజున సీఎం చంద్రబాబు ఈ పథకాన్ని ప్రకటించనున్నట్లు అధికారులు తెలిపారు.



నీరుగట్టువారిపల్లెలో ఓ ఇంట్లో ఉన్న చేనేత మగ్గం

మదనపల్లె టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చేనేత పరిశ్రమలు ఎక్కువగా ఉండే మంగళగిరి, ధర్మవరం, నగరి, మదనపల్లెలో చేనేత కార్మికులు వేల సంఖ్యలో చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. జిల్లాలోని మదనపల్లెలో 12 వేల మంది ఉండగా జిల్లా వ్యాప్తంగా 17 వేల మంది చేనేత కార్మికులు ఈ రంగం, దీని అనుబంధ రంగాలపై ఆధారపడి ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో చేనేత రంగానికి సబ్సిడీలు అన్నీ కట్ చేసి కేవలం ఎంపిక చేసిన కార్మికులకు మాత్రం ఏడాదికి రూ.24 వేలు సహాయం ప్రకటించింది. అది కూడా మూడేళ్లు మాత్రమే ఇచ్చింది. కానీ పట్టు పరిశ్రమకు ముడి సరుకు అయిన వార్పు, జరి కొనుగోలుకు మాత్రం సబ్సిడీ ఇవ్వలేదు. దీంతో పెట్టుబడితో పాటు ముడిసరుకు ధరలు పెరిగి చేనేత కార్మికులకు గిట్టుబాటు కూలి కూడా లభించలేదు. ఈ క్రమంలో జిల్లాలోని చేనేత కార్మికులు కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు కోకొల్లలు. ఈ తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగాన్ని ఆదుకునేందుకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రవేశపెట్టనుంది.

జిల్లాలో సుమారు 17 వేల కుటుంబాలు చేనేత రంగంపై ఆధారపడి ఉన్నాయి. వీటిలో 75 శాతం మదనపల్లెలోనే 12 వేల కుటుంబాలు ఉన్నాయి. మిగిలిన వారిలో ఎక్కువగా తంబళ్లపల్లె, పీలేరు నియోజకవర్గాల్లో చేనేత కుటుంబాలు ఉన్నాయి. ఈ క్రమంలో మదనపల్లె పట్టణం పట్టుచీరలు నేయడంలో ప్రసిద్ధిగాంచింది. ఇక్కడ 7 వేలకు పైగా చేతిమగ్గాలు, 2 వేల పవర్ లూమ్స్ ఉన్నాయి. వీటిలో ఎంత లేదన్నా 10 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. చేనేత రంగానికి అనుబంధంగా రీలర్లు, పట్టుదారానికి రంగులు అద్దే వారు, వార్పు తయారీదారులు ఇలా మదనపల్లె పట్టణంలోని నీరుగట్టువారిపల్లె అలరారుతోంది. ఒకప్పుడు పట్టుచీరల పరిశ్రమ అంటేనే బంగారు బాతుగా పిలుచుకునే వారు. ఇప్పుడు ఈ పరిశ్రమ పాతాళానికి పడిపోయిందని వాపోతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం చేనేత రంగాన్ని ఆదుకునేందుకు ప్రణాళికలు రూపొందించింది.

చేనేత రంగానికి రూ.1.74 కోట్ల విద్యుత్ ఉచితం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న చేనేత మగ్గాలు, పవర్‌లూమ్స్‌కు ఉచిత విద్యుత్ పథకం కింద జిల్లాలోని చేనేత రంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రతి నెలా రూ.1.74 కోట్లు వెచ్చించనుంది. సాధారణంగా కేటగిరీ-1 కిందకు వచ్చే గృహ విద్యుత్‌కు యూనిట్‌కు రూ.1.90 నుంచి 225 యూనిట్ల వరకు రూ.6 వరకు చెల్లించాల్సి ఉంది. నాలుగు చేనేత మగ్గాలు ఉన్న ఇంటిలో ఎంత లేదన్నా నెలకు 200 యూనిట్లకు పైగా విద్యుత్ వినియోగం అవుతుంది. అంటే నెలకు చేనేత మగ్గాలున్న ఇంటికి తక్కువంటే రూ.1200 నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. అదే విధంగా కేటగిరీ-3 పరిధిలోకి వచ్చే పవర్ లూమ్స్‌కు యూనిట్‌కు రూ.5.40 నుంచి 200 యూనిట్లు వినియోగించే సరికి రూ.9 వరకు చెల్లించాల్సి ఉంది. అంటే నెలకు 500 యూనిట్లకు రూ.4,500 విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. ఈ లెక్కన రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న ఉచిత విద్యుత్ పథకంలో చేనేత మగ్గాలకు నెలకు రూ.84 లక్షలు, పవర్ లూమ్స్‌కు నెలకు రూ.90 లక్షలు మొత్తం కలిపి నెలకు రూ.1.74 కోట్లు ప్రభుత్వం ఎస్పీడీసీఎల్‌కు చెల్లించాల్సి వస్తుంది. ఇదే జిల్లాలోని చేనేత రంగాన్ని ఆదుకోనున్న తొలి పథకంగా మారనుంది.

పట్టుచీరల నేతలో ఖర్చు తగ్గుతుంది



మదనపల్లెలో పట్టుచీరల నేతలో ఎక్కువ ఖర్చు వస్తోంది. ప్రభుత్వం ఫ్రీ కరెంటు ఇస్తే చీరల తయారీలో ఖర్చు తగ్గుతుంది. అటు కార్మికులకు, ఇటు పవర్ లూమ్స్ వాళ్లకు ఖర్చు తగ్గి, అంతో ఇంతో మిగులుతుంది. ప్రభుత్వం వచ్చే నాలుగేళ్లలో పట్టుపరిశ్రమలో వార్పు, జరీ కొనుగోలుకు కూడా సబ్సిడీ ఇస్తే బాగుంటుంది.

- పురుషోత్తం, చేనేత విభాగం రాష్ట్ర నాయకుడు, మదనపల్లె.

ఏడాదికి రూ.15 వేలు మిగులుతుంది



చేనేత మగ్గాలు నేసే వారందరికీ ఉచిత విద్యుత్ పథకం కింద ఏడాదికి రూ.15 వేలు మిగులుతుంది. వైసీపీ ఇచ్చిన రూ.24 వేలకు రూల్స్ ఎక్కువ పెట్టారు. అందరిలో 30 శాతం మందికే ఈ వైసీపీ పథకం అందింది. అర్హులకు మోసం జరిగింది. చంద్రబాబు ఇవ్వనున్న ఫ్రీ కరెంటుతో 100 శాతం చేనేత మగ్గాలున్న వారందరికీ ఆదరువు అవుతుంది.

- సురేంద్ర, చేనేత విభాగం ఉపాధ్యక్షుడు, మదనపల్లె.



పవర్ లూమ్ వద్ద పనిచేస్తున్న కార్మికుడు

ప్రజల సమస్యలకు ప్రథమ ప్రాధాన్యం

- పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకుని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా విని పరిష్కరించాలని తెలిపారు. వీరబల్లి మడలానికి చెందిన ఆంజనేయులు తనకు 65 సంవత్సరాలని, తనకు వృద్ధాప్య పింఛను ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. రైల్వేకోడూరు మండలానికి చెందిన కల్యాణి తమ హౌస్‌హోల్డ్ మ్యాపింగ్‌లో పక్క ఇంటి వారిని కూడా చేర్చారని వారిని తొలగించాలని విన్నవించుకుంది. రాయచోటి మండలానికి చెందిన చంద్ర, అరుణలు తమకు సొంత ఇల్లు లేదని, తమది నిరుపేద కుటుంబమని ప్రభుత్వం నుంచి స్థలాన్ని కేటాయించి ఇల్లు కట్టుకునేలా చూడాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలు చేసినోళ్లు అమాయకులా...!

- పీలేరులోనూ లిక్కర్ స్కాం డబ్బులు ఖర్చు పెట్టారు
- ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి



పీలేరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కాంలో అడ్డంగా దొరికిపోయిన వారిపై వీడియో సాక్ష్యాలున్నా అమాయకులుగా బుకాయిస్తున్నారని, పీలేరులోనూ లిక్కర్ స్కాం డబ్బులు ఖర్చు పెట్టారని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పీలేరులో సోమవారం జరిగిన సింగిల్ విండో నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ అక్రమార్జనే ధ్యేయంగా వైసీపీ నాయకులు తయారు చేసిన నాసిరకం మద్యంతో రాష్ట్రంలో దాదాపు 30 వేల మంది చనిపోయారని, వారి ఉసురు ఇప్పుడు వైసీపీ నాయకులకు తగిలిందని తెలిపారు.

పీలేరు నియోజకవర్గానికి చెందిన 135 మందిపై అంగళ్లు, పుంగనూరు అల్లర్లలో అన్యాయంగా కేసులు పెట్టారన్నారు. ఆ కేసులు, అప్పట్లో పోలీసుల నిర్బంధానికి భయపడి కొన్ని నెలలపాటు తమ కుటుంబాలకు దూరంగా అజ్ఞాతంలో గడపాల్సి వచ్చిందన్నారు. అలా పుంగనూరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోనూ వందలాది మందిపై అక్రమ కేసులు బనాయించారన్నారు. అటువంటిది నేడు అక్రమాలకు పాల్పడి జైలు పాలైన వారిని వైసీపీ నాయకులు, అధిష్టానం వెనకేసుకురావడం శోచనీయమన్నారు. లిక్కర్ స్కాంలో పోగు చేసిన రూ.95 కోట్లు పీలేరు నియోజకవర్గంలో తనను ఓడించడానికి వినియోగించారని వెల్లడించారు. పీలేరు, చిన్నగొట్టిగల్లు ప్రాంతాల్లోనూ లిక్కర్ స్కాం డబ్బులు దాచిన డెన్‌లు ఉన్నాయని, వాటి వివరాలు త్వరలోనే ప్రజల ముందుకు వస్తాయని తెలిపారు.

హస్త కళాకారుల సంక్షేమమే ధ్యేయం

- హస్తకళా నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ హరిప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న హస్త కళా నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ హరిప్రసాద్

కురబలకోట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): హస్త కళాకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని హస్త కళా నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ పి.హరిప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మండలంలోని అంగళ్లు సమీపంలోని టెర్రకోట కేంద్రంలో హస్త కళాకారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హస్త కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా హస్త కళాకారులు తయారు చేసిన మట్టి బొమ్మల మార్కెటింగ్ కోసం జాతీయ రహదారి పక్కన క్రాఫ్ట్ కేంద్రం నిర్మాణం కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళతామని తెలిపారు. అంతేకాకుండా మట్టి బొమ్మల వాడకంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌చే ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పలు రకాల సమస్యలను హస్త కళాకారులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధనంజయ, ఎంపీడీవో గంగయ్య, మదనపల్లె ఏఎంసీ చైర్మన్ శివరాం, తంబళ్లపల్లె ఇన్‌చార్జ్ జయచంద్రా రెడ్డి, తంబళ్లపల్లె నియోజకవర్గ సయన్వయకర్త సీడ్ మల్లికార్జుననాయుడు, జనసేన నాయకులు రాందాస్ చౌదరి, సాయినాథ్, మైఫోర్స్ మహేష్, దారం అనిత, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం అందించండి

- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలకు సంబంధించిన ఫిర్యాదులపై సత్వరం స్పందించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. లక్కిరెడ్డిపల్లె మండలం అనంతపురం గ్రామం వడ్డెపల్లికి చెందిన బత్తల సుబ్బమ్మ అనే వృద్ధురాలు తన సమస్యను చెప్పుకునేందుకు ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. విషయం తెలుసుకున్న ఎస్పీ నడవలేని స్థితిలో ఉన్న ఆమె వద్దకే వెళ్లి సమస్యను విన్నారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ సమస్యను చట్ట పరిధిలో పరిష్కరించాలని లక్కిరెడ్డిపల్లె ఎస్ఐని ఆదేశించారు.

రాజంపేట, మదనపల్లె సబ్ కలెక్టర్ల బదిలీ

- రాజంపేటకు భావన, మదనపల్లెకు కల్యాణి



భావన



కల్యాణి

రాయచోటి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోం నిదియాదేవి, మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌లను సోమవారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఏడుగురు ఐఏఎస్ అధికారులు బదిలీ కాగా అందులో వీరిద్దరూ ఉన్నారు. మదనపల్లె సబ్ కలెక్టర్‌గా చల్లా కల్యాణి నియమితులయ్యారు. ఈమె శ్రీకాకుళం జిల్లా ఒప్పంగి గ్రామానికి చెందినవారు. 2023 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందినవారు. ప్రస్తుతం మదనపల్లె సబ్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు.

రాజంపేట సబ్ కలెక్టర్‌గా 2023 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన హెచ్‌ఎస్ భావన నియమితులయ్యారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఈమె ఐఏఎస్ కాక ముందు ఇండియన్ రైల్వే ట్రాఫిక్ సర్వీస్‌లో విధులు నిర్వహించారు. ప్రస్తుతం రాజంపేటకు బదిలీ అయ్యారు. వీరిద్దరూ ప్రస్తుతం ఢిల్లీలో అసిస్టెంట్ కలెక్టర్లుగా పనిచేస్తున్నారు.

గ్రామాల్లో వ్యర్థాల సేకరణకు 'స్వచ్ఛ రథం'

- జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా పీలేరు ఎంపిక

6

మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా లక్ష్మీదేవి



బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మీదేవి

రాయచోటిటౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్‌గా పి.లక్ష్మీదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా మెప్మా కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ అన్నమయ్య జిల్లాకు బదిలీపై వచ్చారు. గతంలో ఆమె రాయచోటి నియోజకవర్గ పరిధిలోని లక్కిరెడ్డిపల్లె మండలం ఎంపీడీవోగా, రామాపురం మండలంలో కూడా పనిచేశారు.

డొక్కు మొబైల్స్ మాకొద్దు

- తిరిగి ఇచ్చేసిన అంగన్వాడీలు



పనిచేయని మొబైల్‌ఫోన్లు చూపుతూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

మదనపల్లె టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్త్రీ, శిశు సంక్షేమ పథకాల అమలుకు గత వైసీపీ ప్రభుత్వం పంపిణీ చేసిన మొబైల్‌ఫోన్లు అసలు పనిచేయడం లేదని, డొక్కు మొబైల్స్ మాకొద్దని అంగన్వాడీలు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ మొబైల్ యాప్‌లు సక్రమంగా పనిచేయడం లేదని, కానీ అధికారులు పని ఒత్తిడి పెంచుతూ వేధిస్తున్నారన్నారు. నాసిరకం మొబైల్ ఫోన్లు ఇచ్చి పనిచేయమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అందుకే అంగన్వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన మొబైల్ ఫోన్లను వాపసు ఇచ్చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ అసోసియేషన్ నాయకులు మధురవాణి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి

- తిరుత్తణి వద్ద కారు ప్రమాదం
- ఆయన సోదరుడు మృతి, కుమారుడికి తీవ్ర గాయాలు
- పీలేరులో విషాదఛాయలు, సంతాపం తెలిపిన ఎమ్మెల్యే నల్లారి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



పీలేరు మాజీ సర్పంచ్ హుమయూన్ (ఫైల్)



షాజహాన్ (ఫైల్)

పీలేరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం తిరుత్తణి వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పీలేరు మాజీ సర్పంచ్ ఎ.ఎస్.హుమయూన్ (60), ఆయన సోదరుడు ఎ.ఎస్.షాజహాన్ (57) దుర్మరణం చెందారు. ఇదే ప్రమాదంలో హుమయూన్ కుమారుడు, పీలేరు పంచాయతీ వార్డు సభ్యుడు హబీబ్ తీవ్రంగా గాయపడి ఆందోళనకర పరిస్థితిలో చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న హుమయూన్ వైద్య చికిత్స కోసం చెన్నైకు వెళుతుండగా వారి కారు తిరుత్తణి వద్ద టిప్పర్‌ను ఢీకొంది. ప్రమాదంలో షాజహాన్ అక్కడికక్కడే మృతి చెందగా, తిరుత్తణి ఆసుపత్రికి తరలిస్తుండగా హుమయూన్ మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన హబీబ్‌ను కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం చెన్నైలోని అపోలో ఆసుపత్రికి తరలించారు. వారి ప్రమాద సమాచారం తెలియడంతో సోమవారం ఉదయం నుంచి పీలేరులో విషాదఛాయలు అలుముకున్నాయి. హుమయూన్ తండ్రి షుకూర్ సాహెబ్ రెండు పర్యాయాలు, హుమయూన్ రెండు పర్యాయాలు పీలేరు పంచాయతీ సర్పంచ్‌గా సేవలు అందించారు.

మృత్యువులోనూ వీడని అన్నదమ్ముల బంధం

తిరుత్తణి దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన హుమయూన్, షాజహాన్ చాలా అన్యోన్యంగా ఉండేవారు. మాజీ సర్పంచ్ షుకూర్ సాహెబ్‌కు హుమయూన్, సలీం, షాజహాన్, అక్బర్, జహంగీర్ ఐదుగురు కుమారులు. వారిలో నాలుగవ వాడైన అక్బర్ సుమారు 30 ఏళ్ల క్రితం వాల్మీకిపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. పెద్ద కుమారుడైన హుమయూన్ పీలేరు సర్పంచ్‌గా రెండుసార్లు పనిచేశారు. సోదరులందరూ ఐకమత్యంతో మెలుగుతూ ఎక్కడా ఎటువంటి కార్యక్రమం జరిగినా కలిసికట్టుగా హాజరయ్యేవారు. ప్రత్యేకించి షాజహాన్, అన్న హుమయూన్‌కు తోడునీడగా వ్యవహరించేవారు. గడిచిన ఎనిమిది నెలలుగా క్యాన్సర్‌తో పోరాడుతున్న అన్నకు వెన్నంటి ఉంటూ ధైర్యం చెప్పేవారు. అదే క్రమంలో ఆసుపత్రికి వెళుతున్న అన్నకు తోడుగా వెళ్లి ప్రమాదంలో కన్నుమూశారు. మాజీ సర్పంచ్ హుమయూన్, అతడి సోదరుడు షాజహాన్ మృతి పట్ల ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. పీలేరు సింగిల్ విండో డెరెక్టర్ల ప్రమాణస్వీకారోత్సవం అనంతరం వారి మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాల మౌనం పాటించారు.

ఐరిస్ స్కానర్లు ఎక్కడ..?

- ఆచూకీ లేని 50 యంత్రాలు
- ఎండీయూ ఆపరేటర్లను వెంటాడుతున్న డీటీలు
- వాపసు చేయకుంటే రూ.6400 చెల్లించాల్సిందే..
- ట్రక్కు ఎన్‌వోసీకి లింకు పెట్టే అవకాశం

పౌర సరఫరాల శాఖ ఎండీయూ ఆపరేటర్లకు అందించిన ఐరిస్ స్కానింగ్ యంత్రాలను వాపసు తీసుకోవాలంటూ ఆ శాఖ కమిషనర్ తహసీల్దార్, సీఎస్‌డీటీలకు ఆదేశాలు జారీ చేశారు. ఇంటింటికీ రేషన్ పంపిణీలో భాగంగా వేలిముద్రలు పడని వృద్ధులు, తదితరులకు రేషన్ పంపిణీలో ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు ప్రభుత్వం ఎండీయూ ఆపరేటర్లకు విజన్‌టెక్స్ కంపెనీ ద్వారా ఐరిస్ స్కానింగ్ డివైజ్‌లను అందజేసింది. ప్రస్తుతం ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో, ఈ యంత్రాలను ఆపరేటర్ల నుంచి వాపసు తీసుకునే ప్రక్రియ ప్రారంభమైంది.

మదనపల్లె, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రెండు నెలలుగా రేషన్ షాపులోనే కార్డుదారులకు రేషన్ పంపిణీ చేస్తున్నారు. 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, మంచంలో నుంచి లేవలేని వారికి మాత్రం వారి ఇళ్లవద్దకే వెళ్లి రేషన్ అందజేస్తున్నారు. ఇలాంటి వారిలో చాలామంది వేలిముద్రలను బయోమెట్రిక్ యంత్రాలు గుర్తించలేపోతున్నాయి. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ఐరిస్ స్కానింగ్ ద్వారా నమోదు చేసి నిత్యావసర వస్తువులు అందజేయాలని, ఇందుకు అవసరమైన యంత్రాలను అప్పటి ఎండీయూ ఆపరేటర్ల నుంచి స్వాధీనం చేసుకుని డీలర్లకు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు చేయడంతో తహసీల్దార్, సీఎస్‌డీటీలు ఆ పనిలో నిమగ్నమయ్యారు.

● రూ.6400 చెల్లించాల్సిందే..

జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట డివిజన్లలోని 30 మండలాల్లో అప్పటి వైసీపీ ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ పంపిణీకి 310 ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేసింది. వీటిలో ప్రతి వాహనానికి ఒక్కో ఐరిస్ స్కానర్ డివైజ్ అందజేసింది. ప్రస్తుతం 250 మంది ఎండీయూ ఆపరేటర్లు వాటిని తిరిగి సీఎస్‌డీటీలకు అప్పగించగా మిగిలిన వారంతా పలు రకాల సమాధానాలు చెబుతున్నారు. అలా అంటే కుదరదని, ఇచ్చిన వస్తువును వాపసు చేయాల్సిందేనంటూ ప్రభుత్వం తెగేసి చెబుతోంది. ఒకవేళ డివైజ్ అప్పగించకుంటే రూ.6400 చెల్లించాలని షరతు విధించింది. లేకుంటే, ట్రక్కుకు ఎన్‌వోసీకి లింకు పెట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. అప్పట్లో రూ.6 లక్షల విలువ చేసే ట్రక్కును పదిశాతం లబ్ధిదారుడి వాటాతో వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణం మంజూరు చేశారు. ఇప్పటికే నాలుగేళ్లకు పైగా ఈఎంఐలు చెల్లించగా, మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం ఆయా కార్పొరేషన్ల ద్వారా బ్యాంకులకు చెల్లించి క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంది. ఈ క్రమంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకుని ఎండీయూ ఆపరేటర్లుగా పని చేసిన ట్రక్కు డ్రైవర్లు వెంటనే ఐరిస్ స్కానర్లను అప్పగించాలని క్షేత్రస్థాయిలో సీఎస్‌డీటీ లు చెబుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే మండలాల వారీగా రేషన్ డీలర్లతో సమావేశాలు ఏర్పాటు చేసి ఈ అంశాన్ని వివరిస్తున్నారు. ఇప్పటికే అందిన ఐరిస్ స్కానర్లను ఆయా ప్రాంతాల్లో ఎక్కువ కార్డులున్న డీలర్లకు అప్పగించారు.

● 50 డివైజ్‌ల ఆచూకీ లేదు

జిల్లాలో 310 ఐరిస్ స్కానర్లను అప్పట్లో ట్రక్కు డ్రైవర్లకు అందజేయగా, ప్రస్తుతం 250 మంది వాటిని వాపసు చేశారు, మిగిలిన వారంతా తమకు ఇవ్వలేదని, తాము మధ్యలోనే నిత్యావసర వస్తువుల పంపిణీ ఆపేసి, మరొకరికి ట్రక్కును అప్పగించామని, ఎక్కడో పోయింది.. కనిపించడంలేదని ఇలా పలు విధాలుగా సమాధానం వస్తుండగా, మరికొందరు ఉపాధి నిమిత్తం బయటి దేశాలకు వెళ్లినట్లు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, అప్పట్లో పేరుకే 310 వాహనాలు ఉన్నా తర్వాత ఏడాది నుంచి 240 నుంచి 250 వాహనాలే పనిచేసినట్లు చెబుతున్నారు. మిగిలిన కొందరు వివిధ కారణాలతో రాజీనామా చేయగా, మరికొందరు మధ్యలో ఇతరులకు వాహనాన్ని అప్పగించారు. మరికొందరు, ఎండీయూను పక్కన పెట్టి వీఆర్వోల అథెంటికేషన్‌తో రేషన్‌షాపులో పంపిణీ చేశారు. మొత్తమ్మీద 240 నుంచి 250 మందికి మాత్రమే పౌరసరఫరాల శాఖ అధికారులు అప్పట్లో ఎండీయూలకు జీతాలు చెల్లించినట్లు చెబుతున్నారు. ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న డివైజ్‌లను సీఎస్‌డీటీలకు అప్పగించగా, ఇక మిగిలిన 50 డివైజ్‌లను ఎలా రికవరీ చేయాలన్నదే వారికి తలనొప్పిగా మారింది. అయితే అవి ఎక్కడ, ఎవరి వద్ద ఉన్నాయి..అసలు ఉన్నాయా? లేదా? అంటూ అధికారులు ఆరా తీస్తున్నారు. ఇందుకోసం వాటిని అప్పగించే సమయంలో జారీ చేసిన అక్విటెన్స్ ఆధారంగా వెతుకుతున్నారు.



ఐరిస్ స్కాన్ చేస్తున్న డీలర్

బాక్సింగ్ క్రీడాకారుడికి సన్మానం



బాక్సింగ్ క్రీడాకారుడు, వీఆర్వో జగదీశ్‌ను సన్మానిస్తున్న కలెక్టర్, జేసీ

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బాక్సింగ్ విభాగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించిన నందలూరు గ్రామ వీఆర్వో జగదీశ్‌ను సోమవారం మధ్యాహ్నం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాక్సింగ్ విభాగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు పొందిన ఎం.జగదీశ్ క్రీడల్లో ఎంతో మందికి ఆదర్శప్రాయమన్నారు. అన్నమయ్య జిల్లా యువత జగదీశ్‌ను ఆదర్శంగా తీసుకొని అన్ని రకాల క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా కృషి చేయాలన్నారు. ఈయనకు పతకాలు పొందేలా శిక్షణ ఇచ్చిన ఆయన కోచ్ ఆనంద్‌ను కూడా ఈ సందర్భంగా సన్మానించి మరింత మంది క్రీడాకారులు ఈ స్థాయికి ఎదిగేలా కృషి చేయాలని సూచించారు.

వాచ్‌మెన్ వేతనాల బకాయిలు చెల్లించాలి

● ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి నరసింహులు

పీలేరు రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న వారికి ఐదు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, వెంటనే బకాయిలు చెల్లించాలని ఏఐటీయూసీ పీలేరు నియోజక వర్గ ప్రధాన కార్యదర్శి కే. నరసింహులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం పీలేరు ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హైస్కూళ్లలో 5333 మంది నైట్ వాచ్‌మెన్‌గా రూ.6 వేల గౌరవ వేతనానికి పని చేస్తున్నారని తెలిపారు. ఐదు నెలలుగా ప్రభుత్వం గౌరవ వేతనం ఇవ్వక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే జిల్లా విద్యాశాఖ అధికారిని కలసి బకాయిలు చెల్లించాలని కోరినా, ఇప్పటి వరకూ ఆ దిశగా ఎటువంటి ముందడుగు పడలేదని తెలిపారు. వెంటనే బకాయిలు చెల్లించకపోతే ఏఐటీయూసీ తరపున పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు డీ. యశోద, టీ. రమణ, పీ. రెడ్డెప్ప, బీ. చిన్నప్ప పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులతో పీడీ పద్మావతి

ఓబులవారిపల్లె, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిన్నఓరంపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు తమిళనాడులో జరిగిన ఆలిండియా టెన్నిస్‌బాల్ క్రికెట్ చాంపియన్‌షిప్ 2025లో ప్రతిభ కనబరచినట్లు ప్రధానోపాధ్యాయురాలు బుజ్జమ్మ తెలిపారు. తమిళనాడులోని తిరువల్లూరు జిల్లా టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలో పదో తరగతి విద్యార్థినులు భాను, సారా మూడో బహుమతిని సాధించారన్నారు.

ఎనిమిది మంది పాత నేరస్థుల బైండోవర్

మదనపల్లె అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పలు కేసుల్లో నిందితులుగా ఉన్న ఎనిమిది మందిని పోలీసులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ వద్ద బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ సమాజంలో సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. ఇకపై నేరాల జోలికి వెళ్లకూడదని వారిని హెచ్చరించారు. పాత నేరస్థుల నుంచి సంతకాలు తీసుకుని పంపివేశారు.

పంట బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

సిద్దవటం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పంటల బీమా కోసం ఈనెల 14 లోపు రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఉద్యాన శాఖాధికారి జయభరత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బొగ్గిడివారిపల్లెలో ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఫసల్‌బీమా యోజన కింద పసుపు, ఉల్లి పంటలకు బీమా ప్రీమియం చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 14 వరకు గడువు పొడిగించిందన్నారు. మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



సునీరం హింబ్రం మృతదేహం

నిమ్మనపల్లి ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలు లాగుతుండగా షాక్ తగలడంతో స్తంభం పైనుంచి పడి గాయపడిన ఓ కూలీ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు ఎస్‌ఐ తిప్పేస్వామి కథనం మేరకు మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రం, దినాజ్పూర్ జిల్లా, బన్సిహరి పంచాయతీ, రూపహత గ్రామానికి చెందిన సునీరం హింబ్రం(30) విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులకు కూలీగా వచ్చాడు. గత బుధవారం తీగలు లాగుతుండగా, హఠాత్తుగా విద్యుత్ ప్రసారం కావడంతో అతను స్తంభం పైనుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతనిని మదనపల్లి ఏరియా ఆసుపత్రి తీసుకెళ్లగా అక్కడి డాక్టర్లు తిరుపతి రుయాకు రెఫర్ చేశారు, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు మృతునికి మూడేళ్ల క్రితం పెళ్లికాగా భార్యతో పాటు ఇద్దరు పిల్లలు వున్నారు. అతని తమ్ముడు గోపాల చంద్ హిమ్బ్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కడప రిమ్స్‌లో ..

రామాపురం, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. రామాపురం మండలం కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ హరిజనవాడకు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామాపురం మండలం సరస్వతిపల్లి గ్రామానికి చెందిన బోనంశెట్టి రవీంద్ర (56) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతనిని కడపలోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రవీంద్రకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాయిదాలకు హాజరు కానందుకు అరెస్ట్



పోలీసుల అదుపులో చంద్రరమేష్

నందలూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కోర్టు వాయిదాలకు హాజరు కానందుకు ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు తిరుపతి పట్టణం కరకంబేడు వీధికి చెందిన చంద్రరమేష్ రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులో నిందితుడు. వాయిదాలకు హాజరు కాకపోవడంతో నందలూరు కోర్టు అతనిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. దీంతో నిందితు డినిఅదుపులోకి తీసుకుని సోమవారం నందలూరు కోర్టులో హాజరుపరచగా, రిమాండ్‌కు రాజంపేట సబ్‌జైలుకు తరలించినట్లు తెలి పారు.

కొరియర్ వాహనం అదుపు తప్పి బోల్తా..

సిద్దవటం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కొరియర్ వాహనం అదుపు తప్పి వాహనం బోల్తాపడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. కడప నుంచి బద్వేలుకు కొరియర్ పార్శిళ్లు తీసుకెళుతున్న వాహనం సోమవారం స్థానిక పరమాత్మ సేవా వృద్ధాశ్రమం సమీపంలో అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని, వంకలో పడిపోయింది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న కిశోర్, చాంద్‌బాషా స్వల్పంగా గాయపడ్డారు. 108లో వారిని కడప రిమ్స్‌కు తరలించారు. ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

తరగతి గదిలో జారి పడి విద్యార్థికి గాయాలు

● పట్టించుకోని ఉపాధ్యాయులు



గాయపడిన మల్లికార్జున

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో కాలు జారిపడడంతో ఓ విద్యార్థి గాయపడ్డాడు. మండలంలోని బూర్లపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవులరెడ్డిపల్లెకు చెందిన ఆవుల తిప్పారెడ్డి, కవిత తంపతుల కుమారుడు ఆవుల మల్లికార్జున 6వ తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం తరగతి గదిలో ప్రమాదవశాత్తు కాలు జారి పడడంతో అతని చెయ్యి విరిగింది. గమనించిన తోటి విద్యార్థులు ఫోన్ చేయడంతో 108 వాహన పైలెట్ రాజు, ఈఎంటీ సాంబశివ విద్యార్థిని బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. అక్కడి వైద్యులు పరిక్షించి మెరుగైన వైద్యం కోసం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. విద్యార్థికి గాయాలైనా ప్రధానోపాధ్యాయుడు కానీ, ఉపాధ్యాయులు కానీ పట్టించుకోలేదని విద్యార్థి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల నిర్లక్ష్యంపై గ్రామస్తులు, విద్యార్థి తల్లి దండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆటో ఢీకొని వృద్ధురాలి మృతి

కలికిరి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వెనుకనుంచి ఆటో ఢీకొనడంతో ఓ వృద్ధురాలు చెందింది. కేవీ పల్లె మండలం నూతనకాల్వ దండువారిపల్లెకు చెందిన చింతపర్తి మంగమ్మ (82) కలికిరిక్రాస్ రోడ్డులోని మనుమరాలి ఇంటికి వచ్చింది. సోమవారం ఉదయం మనుమరాలితో కలిసి దీప్తి బట్టల దుకాణం వద్ద నడిచి వెళుతుండగా వెనుక నుంచి ఆటో ఢీకొంది. దీంతో రోడ్డుపై పడిన ఆమె తలకు బలమైన గాయమైంది. అదే ఆటోలో సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళగా ప్రాథమిక చికిత్స చేసి, తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం మరణించినట్లు హెడ్ కానిస్టేబుల్ మదనమోహన రెడ్డి చెప్పారు. కుమార్తె రామకుమారి ఫిర్యాదు ఆటో డ్రైవరు సుబహాన్ మీద కలికిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్వే సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలి

● సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్



సర్వే సమస్యలపై డీఐలతో సమీక్షిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజల నుంచి వచ్చిన సర్వే సమస్యలన్నింటికీ వారం రోజుల్లో పరిష్కారం చూపాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో మదనపల్లె, తంబళ్లపల్లె డీఐ (డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే)లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ భూ వివాదాలు, ఇతర కారణాలతో డివిజన్‌లోని 11 మండలాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు సర్వేకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. నిర్దేశిత సమయంలో వాటిని పరిష్కరించడంలో ఎందుకు ఆలస్యం అవుతోందని ప్రశ్నించారు. ప్రతి మండలాన్ని పరిశీలించి, విలేజ్ సర్వేయర్లతో సమీక్ష నిర్వహించి వెంటనే సర్వే సమస్యలను పరిష్కరించాలని సూచించారు. మదనపల్లె మండలంలో ఎక్కువగా సర్వేలు పెండింగ్ ఉన్నాయని ప్రశ్నించగా, మండల సర్వేయర్ సరిగ్గా స్పందించడం లేదని డీఐ బదులిచ్చారు. మదనపల్లె మండల సర్వేయర్‌పై విచారణ చేసి నివేదికలు ఇవ్వాలని సబ్‌కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె, తంబళ్లపల్లె డీఐలు వెంకటరమణనాయుడు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్రికెట్ టోర్నీ విజేత పీలేరు



పీలేరు జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

పీలేరు రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతగా పీలేరు . రన్నర్స్‌గా రాజంపేట జట్టు నిలిచాయి. యూటీఎఫ్ 51వ ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయి ఉపాధ్యాయుల క్రికెట్ టోర్నమెంట్, చెస్ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన నాలుగు జట్లు టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన పీలేరు జట్టు కప్పు కైవసం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా జోహర్ నిలిచారు.

చెస్ పోటీ విజేత నాగేంద్ర....

చదరంగం పోటీ విజేతగా రాజంపేటకు చెందిన రాజేంద్ర నిలిచారు. మొత్తం 20 మంది మధ్య ఆసక్తికర పోటీ సాగింది. ఇందులో రాజేంద్ర విజేత కాగా, ద్వితీయ స్థానంలో కలకడకు చెందిన సుబ్బరాయుడు నిలిచారు. విజేతలకు అన్నమయ్య జిల్లా యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు హరిప్రసాద్ మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం, మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. ప్రతి ఏటా జిల్లాలోని ఏదో ఒక ప్రాంతంలో ఉపాధ్యాయుల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్ నాయుడు, ట్రెజరర్ బీ. చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు అక్రమ బాషా, రమణ మూర్తి, జిల్లా క్రీడా విభాగపు కన్వీనర్ సుధాకర్, రొంపిచెర్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం. రెడ్డిప్రదీప్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు నరసరాజు, వివిధ మండ లాల యూనియన్ నాయకులు పీరయ్య, వెంకటరమణ, విజయ్ కుమార్, రాజు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం



ఎగ్ కార్టును ప్రారంభిస్తున్న డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ

సంబేపల్లె, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): మహిళా పేదిరక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ తెలిపారు. పేదరిక నిర్మూలన సంస్థ, నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ సౌజన్యంతో గున్నికుంట్ల గ్రకామంలోని వినాయక స్వయం సమాయక సంఘం అందజేసిన ఎగ్ కార్ట్‌ను సోమవారం పీడీ సత్యనారాయణ ప్రారంభించారు. యాభై వేల రూపాయలు విలువ చేసే ఎగ్ కార్ట్‌ను వినాయక ఎస్‌హెచ్‌జీ సభ్యురాలైన రాజేశ్వరికి ఉచితంగా అందజేశారు. నెలకు ఇరువై నుండి ఇరవై అయిదు వేల రూపాయల ఆదాయం పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డీపీయం ప్రసాద్‌రెడ్డి, వేణుమాధవ, రమేశ్, గంగార్జున, సంజీవ రాజు, సీసీ నాగరాజురావు, ఇతర ప్రాజెక్టు సిబ్బంది పాల్గొనడం జరిగింది.

నేడు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

రాజంపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి మంగళవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వై.సుదాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైనవారు ఉదయం 10 గంటలకు పదో తరగతి మార్కుల లిస్టు, టీసీ, స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు తదితర ధ్రువపత్రాలతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు రావాలన్నారు. ప్రవేశం పొందిన విద్యార్థులు రూ.6 వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉపాధి, ఉన్నత విద్యావకాశాలు మెండుగా ఉన్న ఈ కోర్సుల్లో ప్రవేశం పొంది తమ భవిష్యత్‌కు మార్గం సుగమం చేసుకోవాలని కోరారు.

గ్రామాల్లో వ్యర్థాల సేకరణకు 'స్వచ్ఛ రథం'

● జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా పీలేరు ఎంపిక ● ఎండీయూ ఆపరేటర్లకు ఉపాధి



గుంటూరు జిల్లాలో ప్రారంభించిన స్వచ్ఛరథం

మదనపల్లె టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి, వాటిని రీసైక్లింగ్ చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం ప్రవేశపెట్టింది. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆదేశాలతో గుంటూరు జిల్లాలో స్వచ్ఛ రథం పైలట్ ప్రాజెక్టు ప్రవేశపెట్టారు. ప్రతి జిల్లాలో ఒక గ్రామ పంచాయతీని పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలన్న పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలతో జిల్లాలోని పీలేరు మేజర్ పంచాయతీని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఎంపిక చేసినట్లు డీపీవో రాధమ్మ తెలిపారు. ఎండీయూ ద్వారా రేషన్ పంపిణీని కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో.. తమకు జీవనాధారం కల్పించాలని ఆపరేటర్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. ఈ సమస్య పరిష్కరించడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలసిపోకుండా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛరథం కార్యక్రమం ప్రారంభించి వారికి ఉపాధి కల్పించనుంది.

చెత్తకు బదులుగా నిత్యావసర వస్తువులు

గ్రామాల్లో ప్లాస్టిక్, గాజు సీసాలు, పాత ఇనుప సామాన్లకు బదులుగా నిత్యావసర వస్తువులైన సబ్బులు, షాంపూలు, గోధుమ పిండి, ఎర్రగడ్డలు, కందిపప్పు తదితర వస్తువులను పంపిణీ చేస్తారు. ఎండీయూ ఆపరేటర్ ప్రజల నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలు, గాజు పెంకులు, అట్టపెట్టెలు, పాత ఇనుప సామాను తదితరాలను సేకరించి కిలోకు కొంత మొత్త చొప్పున చెల్లిస్తారు. అయితే, నగదుకు బదులు ఇంట్లోకి అవసరమయ్యే వస్తువులను ఇస్తారు.

ఎండీయూ ఆపరేటర్‌కు నెలకు రూ.25 వేలు వేతనం

స్వచ్ఛరథం నిర్వహించే ఎండీయూ ఆపరేటర్‌కు ఆయా గ్రామ పంచాయతీ జనరల్ నిధుల నుంచి ప్రతి నెలా రూ.25 వేలు చెల్లించనున్నారు. స్వచ్ఛరథం వీధుల్లో తిరుగుతూ ప్రజల నుంచి పొడి చెత్త (ప్లాస్టిక్, గాజు, ఇనుప వ్యర్థాలను) కేజీల లెక్కన తీసుకుంటారు. ఈ చెత్తను స్వచ్ఛరథంలో అమర్చిన అరల్లో ఉంచి, ఆ చెత్త ఎంత విలువ చేస్తుందో లెక్కించి పక్కనే ఉన్న నిత్యావసర వస్తువులను లెక్కవేసి ప్రజలకు చెల్లిస్తారు. ఈ విధానంలో సత్ఫలితాలు వస్తే ప్రతి మండల కేంద్రంలోనూ స్వచ్ఛరథం ఏర్పాటుకు ప్రభుత్వం ఆలోచనలో ఉంది.

పీలేరుకు స్వచ్ఛరథం కేటాయింపు

జిల్లాలోని మేజర్ పంచాయతీ అయిన పీలేరుకు స్వచ్ఛరథం కేటాయించేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉంది. పీలేరు గ్రామ పంచాయతీలో 10,755 కుటుంబాలకు గాను 41,503 మంది నివసిస్తున్నారు. ఈ పంచాయతీ నుంచి నిత్యం ఐదు ట్రాక్టర్లతో చెత్త సేకరిస్తుండగా వీటిలో 390 కిలోల పొడి చెత్త, 600 కిలోల తడి చెత్త వస్తోంది. ఈ చెత్తంతా కంపోస్టు యార్డులో వ్యర్థంగా పడేయకుండా, ఇప్పుడు ప్రవేశపెట్టనున్న స్వచ్ఛరథం వద్ద విక్రయిస్తే అటు ప్రజలకు ఆదాయం, ఇటు జీవ వైవిధ్యం కాపాడినట్లు అవుతుంది. ఈ వినూత్న విధానం విజయం సాధిస్తుందని నమ్మకం వుంది.

-రాధమ్మ, జిల్లా పంచాయతీ అధికారిణి, రాయచోటి

అప్పుడే నూరేళ్లు నిండిపోయాయా..

- భోరున విలపించిన కుటాగుళోళ్లపల్లె
- అశ్రునయనాల మధ్య రోడ్డు ప్రమాద మృతుల అంత్యక్రియలు



కుటాగుళోళ్లపల్లెలో మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబీకులు

ములకలచెరువు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రే.. లేవరా నాన్నా.. అక్క వచ్చింది.. నాన్న పిలుస్తున్నాడు.. బాబాయ్ వచ్చాడు.. ఒక్కసారి లేవరా.. అంటూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుల కుటుంబ సభ్యులు గుండెలు పగి లేలా రోదిస్తున్న దృశ్యాలు కలచి వేశాయి. ములకలచెరువు మండలం పెద్ద పాళ్యం ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వేపూరికోట పంచాయతీ కుటాగుళోళ్లపల్లెకు చెందిన యువకులు వెంకటేష్(26), తరుణ్(24), మనోజ్(19) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే.. పోస్టుమార్టం అనంతరం వారి మృతదేహాలను సోమవారం స్వగ్రామానికి తీసుకు రావడంతో చివరి చూపు చూసేందుకు గ్రామం మొత్తం తరలివచ్చింది. తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి వెళ్ళి యువకుల కుటుంబాలకు పరామర్శించారు. గ్రామానికి వచ్చి అంత్యక్రియలకు హాజరయ్యారు.

ఒక్కో కుటుంబానిది.. ఒక్కో దీనగాథ

వ్యవసాయ కూలీలైన కుటాగుళోళ్లపల్లె చంద్రప్ప, రత్నమ్మ దంపతులు కుమార్తె సుజాతకు ఐదేళ్ళ క్రితం పెళ్ళి చేశారు. డిగ్రీ వరకు చదువుకున్న కుమారుడు వెంకటేశ్ ఇంటి వద్దే ఉంటూ ఉద్యోగాల కోసం అన్వేషిస్తున్నాడు. వేమనారాయణ, శ్యామలమ్మ దంపతులు కూడా వ్యవసాయ కూలీలే. వీరి పెద్ద కుమారుడు కేశవ బెంగళూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా, తరుణ్ ఐటీఐ పూర్తి చేసి ఉద్యోగం వెతుకుతూ ఇంటివద్దే ఉంటున్నాడు. బెంగళూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న ఓబులేసు, కవిత దంపతులకు ఇద్దరు కూతుళ్లుండగా, కుమారుడు మనోజ్ బెంగళూరులో బీటెక్ చదువుతున్నాడు. వీరంతా ఉద్యోగాలు సాధించి కుటుంబాలకు అండగా నిలుస్తారని భావిస్తున్న తరుణంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు.

ఒకే రాత్రి నలుగురు దుర్మరణం

మండలంలో ఆదివారం రాత్రి కాళరాత్రిగా మారింది. ముంబాయి - చెన్నై జాతీయ రహదారిలోని పెద్దపాళ్యం వద్ద జరిగిన ప్రమాదంలో వేపూరికోట పంచాయతీ కుటాగుళోళ్లపల్లెకు చెందిన యువకులు వెంకటేష్, తరుణ్, మనోజ్ దుర్మరణం చెందారు. ఈ సంఘటన జరిగిన గంట వ్యవధిలోనే బురకాయలకోట పంచాయతీ ఎర్రమాసివారిపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు ములకల చెరువు నుంచి ద్విచక్రవాహనంలో తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో దుర్మరణం పాలయ్యాడు. శ్రీనివాసులు నాయుడు రైతు. ఇతనికి భార్య నిర్మల, ఇద్దరు కుమారులు వెంకటేష్, బాలాజీ ఉన్నారు. పెద్దకుమారుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, చిన్న కుమారుడు బాలాజీ డిగ్రీ చదువుతున్నాడు. టీడీపీ నేతలు గుత్తికొండ త్యాగరాజు, ఎర్రగుడి సురేష్, కేవీ రమణ, మూగి రవిచంద్ర, ముత్తుకూరు మౌలా, జేసీబీ సుధాకర్‌నాయుడు, విజయ్‌కుమార్, రామకృష్ణమ రాజు, అశోక్ కుమార్, భాస్కర్‌రెడ్డి, రెడ్డెప్ప తదితరులు ప్రగాఢ సానుభూతిని తెలియజేయడంతోపాటు, గ్రామంలో అంత్యక్రియలకు హాజరయ్యారు.

పెళ్లి చేసుకుంటానని మోసం... వ్యక్తిపై కేసు నమోదు

చెన్నూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భిణిని చేసి.. మోసగించిన వ్యక్తిపై ఓ మహిళ సోమవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు విచారణ చేస్తున్నట్లు సీఐ క్రిష్ణారెడ్డి తెలిపారు. సీఐ వివరాల మేరకు.. చెన్నూరు వనంవీధికి చెందిన పెరుగు శివశంకర్‌కు ఓ మహిళతో ఐదేళ్లక్రితం పరిచయమైంది. పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి నమ్మించి 17 తులాల బంగారు, 7లక్షల డబ్బులు తన జల్సాలకు వాడుకున్నాడు. ప్రస్తుతం ఆమె నాలుగు నెలల గర్భిణి.. వివాహం చేసుకోమని అడిగితే.. గత నెల 21న ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడని.. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎక్కడ ఉండాడో తెలియడం లేదని.. తనకు న్యాయం చేయాలంటూ బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కొండపేటలో ఘర్షణ ... కేసు నమోదు

కలసపాడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపేటలో సోమవారం జరిగిన ఘర్షణపై ఇరు కుటుంబాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిమోతి తెలిపారు. స్థలం విషయంలో జక్కల మరియమ్మ, జక్కల ఆదిలక్షుమ్మ కుటుంబాల మధ్య ఘర్షణ జరిగి ఇరు కుటుంబాల వారు ఒకరిపై ఒకరు కర్రలు, రాళ్లతో దాడి చేసుకున్నారు. దాడిలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇరు కుటుంబాల ఫిర్యాదు మేరకు జక్కల మరియమ్మ, జయన్న, భాస్కర్, జక్కల ఆదిలక్షుమ్మ, ఇండ్ల జయరాములు, రమేష్ తదితరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘర్షణ కేసులో ముగ్గురు అరెస్టు

కడప క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని భగత్‌సింగ్‌కాలనీలో జరిగిన ఘర్షణ కేసుకు సంబంధించి ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. మనస్పర్థల కారణంగా జూలై 28న రాజు ఇంటిలోకి జొరబడి సంపత్, గణేశ్, శివలు దాడి చేశారు. ఇంటిలోని వస్తువలన్నీ చిందర వందర చేశారు. ఈ ఘటనలో నిందితులైన ముగ్గురిని ఎస్‌ఐ తులసి నాగప్రసాద్ తమ సిబ్బందితో కలిసి సోమవారం అరెస్టు చేశారు.

సబ్‌స్టేషన్ ఆపరేటర్‌పై దాడి


గాయపడిన సురేష్

మైదుకూరు రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆదిరెడ్డిపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్ సురేష్‌పై అదే గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రావు దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రమణారెడ్డి తెలిపారు. సోమవారం తెల్లవారుజామున నాగేశ్వర్‌రావు అనే వ్యక్తి సబ్‌స్టేషన్ వద్దకు వచ్చి బిల్లులు బాగా వసూలు చేస్తారు.. కరెంటు ఎందుకు వదలలేదంటూ వాగ్వాదానికి దిగి సురేష్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో గాయపడిన సురేష్‌ను స్థానికులు 108 వాహనం ద్వారా ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పల్సర్ బైకు పోయిందని ఫిర్యాదు

పోరుమామిళ్ల, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చెన్నారెడ్డిపేట గ్రామానికి చెందిన బొజ్జ సురేశ్ అనే వ్యక్తి తన పల్సర్ బైకు పోయిందని స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం కమ్మవారిపల్లె గ్రామంలో తన ఓనరు ఇంటి వద్ద బైకు పెట్టి ఎక్స్‌కవేటర్‌తో పనులకు వెళ్లానని, సోమవారం ఉదయం వచ్చి చూడగా అక్కడ కనిపించకపోవడంతో స్థానిక పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోస్టల్ బాండ్లు అందజేత



దువ్వూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కానగూడూరు గ్రామానికి చెందిన మల్లేష్‌భార్య సుమలత నలుగురు కుమార్తెల పేరున పోస్టాఫీసులో టర్మ్ డిపాజిట్ చేశారు. ఇందుకు సంబంధించిన బాండ్లను సోమవారం కానగూడూరు పోస్టాఫీసు బీపీఎం ప్రసాద్ ఎంపీడీవో రామకృష్ణయ్యకు తెచ్చి చూపించారు. గత డిసెంబరు 20న రైతు మల్లేష్ అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకోవడం, ఈ కథనం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కావడం జరిగింది. దీనికి అమెరికా ఎన్‌ఆర్‌ఐ స్పందించి రూ.లక్ష ఆర్థికసాయం కుటుంబానికి అందజేయడంతో బాధిత కుటుంబంలోని నలుగురు ఆడపిల్లలు గురునాగ పల్లవి, గురునాగ వర్షిత, గురునాగ భార్గవి, గురునాగ నిత్య పేర్ల మీద రూ.25 వేలు చొప్పున డిపాజిట్ చేశారు. సదరు బాండ్లను గ్రామ పంచాయతీ కార్యదర్శుల ద్వారా బాధిత కుటుంబానికి అందజేశారు.

జిల్లాకు 1,321 టన్నుల యూరియా


కడప రైల్వేస్టేషన్‌లో ఎరువులను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రనాయక్ తదితరులు

కడప రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ వ్యవసాయ అవసరాల కోసం సోమవారం కడప రైల్వేస్టేషన్‌కు 1,321 టన్నుల యూరియా వచ్చింది. వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రనాయక్ డీఏవోలు, కంపెనీ ప్రతినిధులు రైల్వేస్టేషన్ వద్దకు చేరుకుని కేటాయించిన పరిణామాలను ఆ యా జిల్లాలకు సరఫరా చేశారు. ఇందులో వైఎస్సార్ కడప జిల్లాకు 942 టన్నులు రాగా వాటిలో 516 టన్నులు ప్రైవేట్ డీలర్లకు, 426 టన్నులు మార్క్‌ఫెడ్‌కు తరలించారు. అలాగే అన్నమయ్య జిల్లాకు 380టన్నులు రాగా అందులో ప్రైవేట్ డీలర్లకు 145 టన్నులు, మార్క్‌ఫెడ్‌కు 235 టన్నులు పంపిణీ చేశారు.

రైతుల ఆలోచనలను పరిగణలోకి తీసుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

సీకేదిన్నె, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆలోచనలను శాస్త్రవేత్తలు పరిగణలోకి తీసుకుని పంటల సాగులో అమలు పరచడం ద్వారా ఉత్తమ ఫలితాలు లభిస్తాయని జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు బి.చంద్రానాయక్ తెలిపారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ వ్యవసాయ పరిశోధన స్థానంలో సోమవారం రైతులు, శాస్త్రవేత్తలతో ముఖాముఖి చర్చావేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎన్నో ఏళ్లగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తూ వ్యవసాయంలో ఎప్పుడు ఏమి చేయాలో తెలుసుకుని ఉంటారని... వారి ఆలోచలను కార్యరూపంలో పెడితే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చన్నారు. రైతులే శాస్త్రవేత్తలుగా పంటలకు రక్షణగా నిలస్తారని.. అందుకు సాంకేతిక సహకారం అందించాల్సిన బాధ్యత శాస్త్రవేత్తలపై ఉందన్నారు.
వ్యవసాయ పరిశోధన శాస్త్రం ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి, కేవీకే కోఆర్డినేటర్ వీరయ్యలు రైతులకు, శాస్త్రవేత్తలు అందించాల్సిన సూచనలు గురించి వివరించారు. శాస్త్రవేత్తలు సునీల్‌కుమార్, శ్రీవల్లి, మాధురి వివిధ పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులతో కలిసి చర్చించారు. వరి, పసుపు, పత్తి, వేరుశనగ, మినుము తదితర పంటల్లో ఏ సమయంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో రైతులతో సమగ్రంగా తెలుసుకున్నారు. ఆత్మా పీడీ విజయలక్ష్మి పంటల్లో అధిక దిగుబడులు పొందేందుకు జాగ్రత్తలు గురించి వివరించారు. బీఆర్‌సీ ఏడీఏలు రమణారెడ్డి, అశోక్‌రెడ్డి, ఏవోలు పద్మజ, సుచిత్ర, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తాం : డీఈవో


ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న డీఈవో షంషుద్దీన్

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చెన్నంరాజుపల్లె జడ్పీ హైస్కూలులో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని డీఈవో షంషుద్దీన్ తెలిపారు. శనివారం జరిగిన అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు గ్రామ ప్రజలు జడ్పీ హైస్కూలులో విద్యార్థులకు మౌళిక వసతులు కల్పించాలని వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం డీఈవో పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సుబ్బయ్య పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉందని, అదనపు తరగతి గదులు నిర్మించాలని, టాయిలెట్లు, కాంపౌండ్‌వాల్ ఏర్పాటు చేయాలని కోరారు. పాఠశాలలో సౌకర్యాలు కల్పిస్తే చుట్టుపక్కల విద్యార్థులు పాఠశాలలో చేరి విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. దీనిపై స్పందించిన డీఈవో స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్‌తో మాట్లాడి మౌలిక వసతులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులతో పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 శోభారాణి, పాఠశాల హెడ్‌టీచర్ వెంకటరమణ, ఉపాధ్యాయులు, సీఆర్‌పీ భాస్కర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పేదలకు భూములు పంపిణీ చేయాలి



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

బద్వేలు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బద్వేలు నియోజకవర్గంలోని కాశినాయన మండలం, వరికుంట్ల, నాయనపల్లె, ఆకుల నారాయణపల్లె, సావిశెట్టిపల్లె, అక్కెంగుండ్ల, ఇటుకలపాడు గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదలకు భూమి, ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్ల నుంచి ఈ గ్రామాలలోని నిరుపేదలకు స్వంత భూమి లేక కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారని, కరువు వచ్చినపుడు ఇతర ప్రాంతాలకు వలసపోతున్నారని వాపోయారు. ఇతర ప్రాంతాల వారు ప్రభుత్వ భూములను కబ్జా చేసి ఫామ్‌హౌస్‌లు నిర్మించుకుంటున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పి.అన్వేష్ మాట్లాడుతూ పేదలు సాగు చేసుకుంటున్న భూములను సైతం కబ్జాదారులు దౌర్జన్యంగా లాక్కుంటున్నారని, పేదలకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ప్రజలపక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జకరయ్య, పోలయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర దర్యాప్తుతో చెత్త వసూళ్ల అక్రమాలను నిగ్గుతేల్చాలి


విశ్వేశ్వరనాయుడుకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ సభ్యులు

కడప సెవెన్ రోడ్స్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చెత్త పన్ను వసూళ్లలో కడప మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కోట్లాది రూపాయల అవినీతి జరిగిన నేపథ్యంలో అక్రమాలను నిగ్గు తేల్చాలని సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడుకు సీపీఐ ప్రతినిధి బృందం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెంకటశివ మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆదేశాల మేరకు జగన్ ప్రభుత్వం కరోనా కష్టకాలంలో చెత్త వసూళ్లు చేసేందుకు నిర్ణయించారన్నారు. చెత్త బుట్టల కొనుగోళ్లలో, చెత్త బండ్ల ఏజెన్సీ కాంట్రాక్టర్‌కు జనరల్ ఫండ్ నుంచి దాదాపు డబ్బులు చెల్లించి పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయన్నారు. దీనిపై ఉన్నతస్థాయి దర్యాప్తు చేపట్టి నిజాలను వెలికితీయాలన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ


కొత్తమాధవరంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

ఒంటిమిట్ట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఒంటిమిట్ట, కొత్తమాధవరం గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ పరిశీలించారు. ఈనెల 12న జరగనున్న జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. సోమవారం మధ్యాహ్నం మండలంలోని కొత్తమాధవరం, ఒంటిమిట్ట ఉన్నత పాఠశాలల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించి.. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఎన్నికల సందర్భంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ బాబు, ఇన్‌చార్జి ఎస్‌ఐ రఫీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

34 మంది గ్రేడ్-2 వీఆర్వోల బదిలీ

కలికిరి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో మరో 34 మంది గ్రేడ్-2 వీఆర్వోలను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ సోమ వారం ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 26న 45 మంది గ్రేడ్-1 వీఆర్వో లను బదిలీ చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో మదనపల్లె నుంచి 10 మంది వీఆర్వోలను బదిలీ చేయగా తాజాగా అక్కడి నుంచి మరో 9 మంది గ్రేడ్-2 వీఆర్వోలను బదిలీ చేశారు. మిగిలిన వారిలో గుర్రంకొండ, రామసముద్రం మండలాల నుంచి నలుగురు వంతున బదిలీ అయ్యారు. అదే విధంగా వాల్మీకిపురం, కలకడ, కురబలకోట మండలాల నుంచి ముగ్గురేసి వంతున బదిలీ జరిగింది. మొలకలచెరువు, పీటీఎం మండలాల నుంచి ఇద్దరు వంతు న, కలికిరి, సుండుపల్లె నుంచి ఒక్కొరి వంతున బదిలీ చేశారు. ఇక చిత్తూరు జిల్లా నుంచి బదిలీ మీద జిల్లాకు వచ్చిన ఇద్దరికి కూడా మండలాలు కేటాయించారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

రాజంపేట టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలం నారంరాజుపల్లె జవహర్ నవదోయ విశ్వవిద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో 11వ తరగతి ప్రవేశానికి అర్హులైనవారు ఈనెల 10 లోపుల దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ గంగాధరన్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పాసైన విద్యార్థులు వారి బయోడేటాతో పదో తరగతి మార్కులిస్టు జిరాక్స్ కాపీ ఒక జత చేసి జవహర్ నవోదయ విద్యాలయ మెయిల్‌కు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. పదో తరగతిలో మార్కుల శాతాన్ని బట్టి సీట్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు.

విశ్వవిద్యాలయ ప్రగతి ప్రధానం.. వీసీ


మాట్లాడుతున్న వీసీ అల్లం శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాబోయే తరాలకు ఉజ్వల భవిష్యత్తును ఇచ్చి దేశ ప్రగతికి దోహదపడనున్న విశ్వవిద్యాలయ ప్రగతి మనకు ప్రధాన అజెండా అని యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం ఆయన వివిధ విభాగాల డీన్‌లు, అన్ని విభాగాల అధిపతులతో ఆయన తన చాంబర్‌లో భేటి అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం ప్రొఫెసర్‌షిప్‌కు ఎంపికైన స్పోక్ ఇన్‌స్టిట్యూషన్‌లో యోగి వేమన విశ్వవిద్యాలయం కూడా ఒకటని తెలిపారు. ఇక్కడి నుంచి ఒక ప్రొఫెసర్ ఎంపిక అవుతారని.. వారి పరిశోధనకు రూ.30లక్షల నిధులు ఇస్తారని వివరించారు. ఒక కమిటీ ద్వారా ప్రొఫెసర్‌ని ఎంపిక చేస్తామన్నారు. విశ్వవిద్యాలయంపై అధికారుల మీద అసత్య ఆరోపణలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను కోరుతామన్నారు. వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, ప్రొద్దుటూరు వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జయరామిరెడ్డి, డీన్‌లు, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయ ప్రతిష్టలకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదు

కొన్ని విద్యార్థి సంస్థలు పనిగట్టుకొని విశ్వవిద్యాలయ పరువు ప్రతిష్టలకు భంగం కలిగిస్తూ అభివృద్ధికి విఘాతం కలిగిస్తూ వ్యవహరిస్తుండడం ఆవేదనకు గురిచేస్తోందని వైవీయూ వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు అన్నారు. దేశస్థాయిలో నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ఫ్రేమ్‌వర్క్‌లు వందలోపు ర్యాంకు, న్యాక్ ఏ గ్రేడ్‌తో అత్యున్నత పరిశోధన ప్రమాణాలతో విశ్వవిద్యాలయ ప్రగతిపథంలో వెళ్తుంటే పనిగట్టుకొని కొన్ని విద్యార్థి సంఘాలు విశ్వవిద్యాలయంపై విషం చిమ్ముతున్నాయన్నారు. నాలుగేళ్లుగా వైవీయూలో కాన్వకేషన్ నిర్వహించలేదని.. అందుకు కారణాలు అనేకం ఉండవచ్చు.. ఇదివరకుపనిచేసిన రెడ్యులర్ వీసీ ఆచార్య చింతా సుధాకర్ కాన్వకేషన్ ప్రక్రియను ప్రారంభించారు. తర్వాత ప్రభుత్వం మారడం, వీసీల మార్పురీత్యా అది ఆగిపోయిందని తెలిపారు. వైవీయూలో డిగ్రీ, పీజీ చేసిన వారు వారి ఉద్యోగ నియామకాలు, పై చదువులు, పరిశోధనలు, విదేశాలకు వెళ్లడం ఇత్యాధి కారాణాలతో కాన్వకేషన్ నిర్వహించాలంటూ విద్యార్థి సంఘాలుసైతం కోరాయన్నారు. ఈ నేపథ్యంలో గౌరవ రాష్ట్ర గవర్నర్‌ను కలిసి అనుమతి తీసుకొని ప్రక్రియను ప్రారంభించామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కల్యాణ ఉత్సవ విగ్రహాలకు పూజలు


ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వీరబ్రహ్మేంద్రస్వామి సమేత గోవిందమాంబల కల్యాణ ఉత్సవ విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. దేవస్థాన ఆస్థాన పండితులు ఇడమకంటి జనార్ధనచార్యుల ఆధ్వర్యంలో దేవస్థాన ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ పర్యవేక్షణలో సోమవారం ఉదయం 9గంటల నుంచి కల్యాణ మండపంలో కలశస్థాపన నిర్వహించి హోమాలు చేపట్టారు. మధ్యాహ్నం 11కు గోపూజ నిర్వహించి ప్రదక్షిణలు చేపట్టారు. కల్యాణ మహోత్సవంలో భాగంగా నూతన కల్యాణ విగ్రహమూర్తుల మహా సంప్రోక్షణ సందర్భంగా దాతలు బెంగుళూరుకు చెందిన గౌరీశంకరాచారి, పద్మావతమ్మ దంపతులు, రవికుమార్, నళినాక్షి దంపతులు గోపూజ కార్యక్రమం చేపట్టారు. అలాగే నూతన కల్యాణ భవనంలో హోమాలు చేశారు. ఈసందర్భంగా ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ మాట్లాడుతూ లోక కళ్యాణార్థం ఆగస్టు 6న గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి మాస కళ్యాణోత్సవం ప్రారంభమై 2027 జూలై వరకు ప్రతి నెల జరుగుతూనే ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మేనేజరు ఈశ్వరాచారి, వేదపండితులు, కళ్యాణ మహోత్సవ దాతలు పాల్గొన్నారు.

ఈశ్వరీమాత ఆలయ పునర్నిర్మాణానికి రూ.3,72,117లు విరాళం



విరాళవిచ్చిన దాతలు ప్రవీణ్‌కుమార్ దంపతులు, పూజలు చేస్తున్న పేరుసోముల గురుప్రసాద్

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్ర హ్మేంద్ర స్వామి మనువరాలు జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారి ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు రూ.3,72,117లు విరాళం అందించినట్లు ఆలయ కార్య నిర్వాహక అధికారి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. సోమిశెట్టి ప్రవీణ్‌కుమార్ సతీమణి అశ్విని రూ.2లక్షలు విరాళం అందించారు. అలాగే అనంతపురానికి చెందిన సీనియర్ న్యాయవాది పేరుసోముల గురుప్రసాద్ రూ.లక్ష, బ్రహ్మంగారిమఠం మండలం కందిమల్లయ్యపల్లె గ్రామం పాతూరు గ్రామ నివాశి రిటైర్డ్ తెలుగు అధ్యాపకుడు ముచ్చర్ల శేషయ్య రూ.72,117లు ఈశ్వరీదేవి మఠం మఠాధిపతి వీరశివకుమారస్వామికి చెక్కులు అందించినట్లు కార్యనిర్వాహక అధికారి తెలిపారు.

'ట్రిపుల్‌ఐటి క్యాంటీన్లను అక్షయపాత్రకు ఇవ్వడం తగదు'

కడపసెవెన్ రోడ్స్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న ట్రిపుల్‌ఐటీలలో విద్యార్థులకు సంబంధించిన క్యాంటీన్లను అక్షయపాత్రకిచ్చే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆప్కాస్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్రప్రధాన కార్య దర్శి పి.వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు నిర్వహించే క్యాంటీన్లలో లోపాలు ఉన్నాయన్న పేరుతో అక్షయపాత్ర అనే సంస్థకు అప్పగించడంలోనే పెద్ద మతలబు ఉందన్నారు. ఇపుడు నిర్వహణ చేస్తున్న నిర్వాహకులకు ఒక విద్యార్థికి రోజుకు రూ.90మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. ఇపుడు అక్షయపాత్రకు సంస్థకు రూ.120 ఇవ్వాలని చూస్తున్నారన్నారు. దీని వెనుక అంతర్యమేమిటన్నారు. రాష్ట్రం మొత్తం ఒక వ్యక్తి నిర్వహణ చేయడం వల్ల వారికి ప్రభుత్వంలో ఉన్న పెద్దలకి దగ్గర సంబంధాలు ఉంటాయన్నారు. దీంతో నాణ్యత లోపించే అవకాశం ఉందన్నారు. ట్రిపుల్‌ఐటీలలో క్యాంటీన్లను అక్షయ పాత్రకిచ్చేనిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వారు కోరారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

రైల్వేకోడూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని రైల్వేకోడూరు తహసీల్దార్ కోనేటి అమర్‌నాథ్ తెలిపారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా వీఆర్వో, ఆర్ఐ, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామ రికార్డులు సక్రమంగా ఉండాలన్నారు. పీజీఆర్ఎస్ నుంచి వచ్చిన ఫిర్యాదులను పూర్తిగా పరిష్కరించాలన్నారు. అధికారులు సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నూతన వైద్యాధికారిగా చిరంజీవిరెడ్డి



సిద్దవటం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సిద్దవటం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ వైద్యాధికారిగా డా క్టర్ చిరంజీవిరెడ్డి సోమవారం బాధ్యత లు స్వీకరించారు. డాక్టర్ చిరంజీవిరెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజు రోగులకు అం దుబాటులో ఉండి వైద్యసేవలు అందిస్తానన్నారు. వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలన్నారు.

భూ ఆక్రమణకు పాల్పడితే చర్యలు

ఓబులవారిపల్లె, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): భూ ఆక్రమణకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దారు యామిని హెచ్చరించారు. సోమవారం మండలంలోని గోవిందంపల్లె రెవెన్యూ గ్రామంలో భూ ఆక్రమణలను తొలగించామన్నారు. కడియాలపల్లె పరిసరాల్లో సబ్‌స్టేషన్ పక్కన సర్వేనంబరు 91లో ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నారని ఫిర్యాదు రావడంతో వెంటనే వీఆర్వోను పంపి మామిడి మొక్కలను తొలగించినట్లు పేర్కొన్నారు.

అంగన్వాడీ సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

రైల్వేకోడూరు రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని సోమవారం అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు కోడూరు పట్టణంలోని అంగన్వాడీ కేంద్రం వద్ద సీఐటీయూ, ఏఐటీయుసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అంగన్వాడీ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్స్ పనిచేయకపోవడంతో వాటిని తిరిగి అధికారులకు అందజేసినట్లు పేర్కొన్నారు. రేషన్ సరుకులను అంగన్వాడీ కేంద్రం వద్దకే సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ప్రాజెక్ట్ లీడర్లు రమాదేవి, రాధ, పద్మ, వనజ కుమారి, జయలక్ష్మి, నిర్మల అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

సంబేపల్లె, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవపట్ల వద్ద గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మధుమతి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేవపట్ల బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో 5, 6, 7, 8, 9, ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ, ఎంపీసీ విభాగంలో సీట్లు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. ఐదవ తరగతిలో 62 సీట్లు, ఆరవ తరగతిలో 44, ఏడవ తరగతిలో 37, 8వ తరగతిలో 10, 9వ తరగతిలో 8, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 25, బైపీసీలో 9 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ ధ్రువీకరణ పత్రాలు తీసుకొచ్చి స్పాట్‌లో అడ్మిషన్లు పొందవచ్చునని తెలిపారు. పూర్తి వివరాలకు 9704550127కు ఫోన్ చేయాలని కోరారు.

విలువలతో కూడిన విద్య అవసరం

నందలూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అవసరమని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగనపల్లి వెంకటరమణ అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగనపల్లి వెంకటరమణ సోమవారం విద్యార్థులకు విలువలతో కూడిన పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించే విధంగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు సూచనలతో విలువల విద్య పుస్తకాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. వినయం, నిజాయితీ, కుటుంబ సంబంధాలు విద్యార్థులకు తెలియజేయడంతో పాటు సమాజహితానికి పాటుపడాలనే విషయం వారిలో విద్యార్థిదశలోనే ఈ పుస్తకాల ద్వారా సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గ్లోరి కిరణ్‌ఉజ్వల, ఆనందాచారి, వెంకటసుబ్బయ్య, విజయకుమారి, మస్తాన్, ప్రసాద్‌రావు, రమణమ్మ, జ్యోతిప్రియ, వెంకటరమణ, గీతా, గౌరి, గాయత్రిదేవి, డాక్టర్ శర్వాని పాల్గొన్నారు.



పుస్తకాలను పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు గంగనపల్లి వెంకటరమణ

భక్తిశ్రద్ధలతో బోయకొండమ్మ విగ్రహ ప్రతిష్ఠ

సుండుపల్లె, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): భక్తిశ్రద్ధలతో బోయకొండమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. అక్కంపల్లి గుట్టలో నూతనంగా నిర్మించిన ఆలయంలో బోయకొండమ్మ, పోతురాజు, సింహ, బలిపీఠం, బలిస్థంభం, స్థిరప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు వారు తెలిపారు. 6 గంటల నుంచి యంత్రపూజ దృష్టి స్థాపన, ప్రాణస్థాపన నిర్వహించారు. అరుణ్‌కుమార్ నాయుడి కుటుంబ సభ్యులు బోయకొండమ్మ విగ్రహాలను అందించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చప్పిడి మహేశ్‌నాయుడు, చప్పిడి రమేశ్‌నాయుడు అన్నదానం నిర్వహించారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.



సుండుపల్లి: బోయకొండమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

భుజంగేశ్వర స్వామికి పూజలు



రైల్వేకోడూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు పట్టణంలోని భుజంగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ సోమవారం సందర్భంగా పూజలు చేశారు. అర్చకులు బోయలకుంట్ల పవన్ శర్మ, దూర్జటి యోగీశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భుజంగేశ్వరుడు, భువనేశ్వరి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.



రైల్వేకోడూరు: ప్రత్యేక అలంకరణలో భుజంగేశ్వరుడు, భువనేశ్వరిదేవి

7న మండల మీట్

ఓబులవారిపల్లె, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎంపీడీవో కార్యాలయం సభావభవనంలో ఈనెల 7న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అన్నారెడ్డి మల్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన సూచించారు.

అన్నదాత సుఖీభవ అమలు ఆనందదాయకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

రామాపురం, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ అమలు ఆనందదాయకమని టీడీపీ నాయకుడు వెంకట్రామరాజు అన్నారు. ఈ మేరకు సోమవారం సీఎం చంద్రబాబు, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం సాయం అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వాసుదేవుడు, 38వ భూత్ కో కన్వీనర్‌లు చంద్రశేఖర్, మల్లికార్జున, స్కూల్ చైర్మన్ నాగేంద్ర, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

రాజంపేట టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండల పరిధిలోని బోయనపల్లి జగనన్న కాలనీలో రోడ్లు, కాలువలు, మంచినీటి పైపులైన్లు, వీధిలైట్లు తదితర మౌలిక వసతులు కల్పించాలని ఆర్సీపీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మడగలం ప్రసాద్ కోరారు. ఈ మేరకు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఏవో శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

పెనగలూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండలవ్యాప్తంగా ఈ ఖరీఫ్ సాగులో పంటలు సాగుచేసిన రైతులకు యూరియా కొరత లేకుండా చూసుకోవాలని పెనగలూరు తహసీల్దారు అమరేశ్వరి, వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యం సిబ్బందికి సూచించారు. సోమవారం సాయంత్రం పెనగలూరు 1, 2 రైతుసేవా కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలు సాగు చేయని రైతులకు ఎరువులు ఇచ్చి దుర్వినియోగం చేయవద్దని అన్నారు. ఇదే సమయంలో పంటలు సాగుచేసిన రైతులకు కొరత రాకుండా అధిక ధరలకు అమ్మకుండా చూసుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ నిధులు అందని రైతులను గుర్తించి వీఆర్వో ద్వారా వారి సమస్యను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

డిగ్రీ కళాశాలలో ఉచిత కంటి వైద్యశిబిరం

రాజంపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పురుషోత్తం అధ్యక్షతన అగర్వాల్ ఐ హాస్పిటల్ బృందంచే కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పురుషోత్తం మాట్లాడుతూ కంటికి సంబంధించిన సమస్యలు ప్రారంభంలోనే తెలుసుకుంటే భవిష్యత్‌లో వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. అగర్వాల్ ఐ హాస్పిటల్ ద్వారా నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యశిబిరాన్ని అధ్యాపకులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుమారు 100 మంది విద్యార్థులు కంటి వైద్య చికిత్సలు చేయించుకున్నారు.

గ్రంథాలయాలు విద్యార్థులకు వరం

ఒంటిమిట్ట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతి పాఠశాలలో గ్రంథాలయాలు ఉండడం విద్యార్థులకు వరమని ఎంఈవో-2 బ్రహ్మయ్య పేర్కొన్నారు. సోమవారం మండలంలోని రాచపల్లి ఉన్నత పాఠశాలలో గ్రంథాలయం సైన్స్ ల్యాబ్‌ను పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో-2 బ్రహ్మయ్య మాట్లాడుతూ గ్రంథాలయాన్ని విద్యార్థులు తప్పకుండా ఉపయోగించుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయులు జమాల్‌రెడ్డి మాట్లాడుతూ గ్రంథాలయాలను ఉపయోగించుకుని అనక మంది ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. మన పాఠశాలలో అనేక అమూల్యమైన గ్రంథాలున్నాయన్నారు. పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు రాజారెడ్డి మాట్లాడుతూ సైన్స్ ల్యాబ్‌లో అన్నిరకాల ప్రయోగాలకు సంబంధించిన పరికరాలు ఉన్నాయని, విద్యార్థులు వాటిని ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని వారు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

రాజంపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయ సభాభవనంలో సోమవారం నిర్వహించిన ప్రజా పరిస్కార వేదికలో ప్రజలు పలు సమస్యలపై కార్యాలయ ఏవో శ్రీధర్‌రావుకు వినతిపత్రాలు అందజేసి సమస్యలు విన్నవించుకున్నారు. తమ సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని పోలి గ్రామానికి ప్రజలు, మహిళలు కోరారు. తమకు చౌక దుకాణం దూరంగా ఉందని, దానిని వేరు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన శ్రీధర్‌రావు సమస్య పరిష్కరిస్తామన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పుల్లంపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిదిలోని రెడ్డిపల్లె అరుంధతివాడలో సోమవారం చిట్వేలి అచ్చమ్మ(70) అనారోగ్య కారణంగా మృతిచెందడంతో టీడీపీ బీసీ నాయకులు రొంపిచెర్ల మురళి ఆర్థికసహాయం అందించారు. మృతురాలు అచ్చమ్మకు నివాళులర్పించి ఆమె కుటుంబానికి రూ.20 వేలు ఆర్థికసహాయం చేశారు. పంచాయతిలో ఎవరు చనిపోయినా తెలుగుదేశంపార్టీ బీసీ నాయకులు రొంపిచెర్ల మురళి రూ.20 వేలు తనతండ్రి హయాం నుంచి ఆర్థికసహాయం చేస్తూ తమ దాతృత్వాన్ని చాటుకుంటున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

రాయచోటిటౌన్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్ ఆధ్వర్యంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన ప్రముఖులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షురాలు కోటపాటి సుబ్బమ్మతో పాటు అరుణకుమారి, నరసింహ, శివరాం, మౌనిక, శ్రావణి, హారిక, సుందరం, వీరేంధర్, శేఖర్ తదితరులు పార్టీలో చేరారు. ఈ సంద కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అలీఖాన్, జిల్లా ఉపాధ్యక్షుడు దర్బార్‌బాషా, జిల్లా కాంగ్రెస్ చీఫ్ సెక్రటరీ అమీర్, సుండుపల్లె మండల అధ్యక్షుడు సల్మాన్, చిన్నమండెం మండల అధ్యక్షుడు షబ్బీర్, అమీర్ బాషా, మహమ్మద్‌రఫి, గిరిబాబు పాల్గొన్నారు.

కొత్తమాధవరంలో పోలీసుల కవాతు

ఒంటిమిట్ట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తమాధవరం, కొండమాచుపల్లె గ్రామాల్లో సోమవారం సాయంత్రం పోలీసులు సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ బాబు, ఎస్ఐ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో సాయుధ బలగాలు, సివిల్ పోలీసులతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.



మాధవరంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పరిసరాల పరిశుభ్రతే దోమల నివారణకు మార్గం

● జిల్లా మలేరియా అధికారి రామచంద్రారెడ్డి



దోమల నివారణకు స్ప్రే చేయిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

రాయచోటిటౌన్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతే దోమల నివారణకు మార్గమని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ఎగువ అబ్బవరం సచివాలయం, రాయుడు కాలనీలో ఏపీఎం స్ప్రేయింగ్, స్కూల్ హెల్త్ ప్రోగ్రాం, అంగన్వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణకు ప్రతి ఇంట్లో స్ప్రే చేయించుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.అలాగే నీటి తొట్లు, డ్రమ్ముల్లో నీరు నిలవకుండా శుభ్రం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ దోమతెరలను వాడాలని, సాయంత్రం సమయంలో వేపాకు పొగ వేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి నవీన్, మలేరియా సబ్ యూనిట్ అధికారి జయరామయ్య, సూపర్‌వైజర్ నూర్జహాన్, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్, రామచంద్ర, ఏఎన్ఎం రేష్మ, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'క్రమశిక్షణ, సేవా భావానికి ప్రతీక స్కౌట్'



ధ్రువపత్రాలు అందజేస్తున్న నరసింహారెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో పాటు దేశభక్తి, సామాజిక సేవా భావాలను పెంపొందించడానికి బాలభటులు ఉద్యమం ఎంతగానో తోడ్పడుతుందని స్కౌట్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి అన్నారు. సోమవారం జిల్లాలో నూతనంగా ప్రారంభించిన యూనిట్ లీడర్లకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో స్కౌట్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. బాలబాలికలకు వేర్వేరుగా యూనిట్లను ఏర్పాటు చేయాలన్నారు. స్కౌట్‌లో చేరడం ద్వారా విద్యార్థి దశ నుంచే తల్లిదండ్రులు, గురువులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం, సమాజం పట్ల బాధ్యతగా నడుచుకోవడం అలవడుతుంద న్నారు. స్కౌట్ అండ్ గైడ్స్ శిక్షణ పొందిన విద్యార్థులకు శారీరక దారుఢ్యం ఏర్పడుతుందన్నారు. నాయకత్వ లక్షణాలు ఏర్పడతాయన్నారు. జిల్లా అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, క్లబ్ మాస్టర్ గురునాథరెడ్డి, స్కౌట్ మాస్టర్లు నితిన్‌రెడ్డి, రఫీక్ పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని వినతి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): కేజీబీవీ గురుకుల హాస్టళ్లలోని విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమంలో డీఆర్వోకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పదిరోజుల పాటు ప్రతి హాస్టల్‌లో ఏఐఎస్ఎఫ్ నాయకులు సందర్శించారన్నారు. ఏ హాస్టల్‌కు వెళ్లినా సమస్యలు స్వాగతం పలుకుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సొంత భవనాలకు నిధులు కేటాయించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని చాలా హాస్టళ్లకు విద్యార్థులకు సరిపడా గదులు, మరుగుదొడ్లు, స్నానపు గదులు లేవని, వాటిని నిర్మించాలని డిమాండ్ చేశారు. అలాగే నాణ్యమైన ఆహారం అందించడం లేదన్నారు. ఏఐఎస్ఎఫ్ ఏరియా కార్యదర్శి కార్తీక్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యం

రాయచోటిటౌన్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యమని మంత్రి సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. రాయచోటి మండల పరిధిలోని గొర్లముదివేడు గ్రామ కస్పాలో సోమవారం నూతన బోరును ప్రారంభించారు. తాగునీటి ఎద్దడి తీర్చాలని గొర్లముదివేడు గ్రామ కస్పా ప్రజలు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి విన్నవించడంతో ఆయన స్పందించి గొర్లముదివేడులో బోరు వేయించి మోటారు బిగించారు. ఈ మేరకు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి బోరును ప్రారంభించి నీటిని అందించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ జిలానీబాషా, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఎరువుల కొరత రానివ్వకుండా చూడండి



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు, రైతులు

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు ఎరువులు, విత్తనాల కొరత రానివ్వకుండా చూడాలని రాయచోటిలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట వైసీపీ రైతు విభాగం నాయకులు దర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ రైతులను కూటమి ప్రభుత్వం నట్టేట ముంచిందని రాష్ట్రంలో యూరియాతో సహా ఎరువుల కొరత, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు యర్రపురెడ్డి ఆరెంరెడ్డి, స్టేట్ భూత్ వింగ్ జనరల్ సెక్రటరీ రెహమాన్‌ఖాన్, రైతు విభాగం నాయకులు పాల్గొన్నారు.

'అన్నమాచార్య' అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు విశిష్ట గౌరవం



ప్రశంసాపత్రం అందుకుంటున్న చిన్న వెంకటసుబ్బయ్య

రాజంపేట టౌన్, ఆగస్టు 4 (ఆంధ్ర జ్యోతి):అన్నమాచార్య విశ్వవిద్యాలయంలో ఫిజిక్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.చిన్నవెంకటసుబ్బయ్య 2024-25 విద్యా సంవత్సరంలో 9 జనరల్ పరిశోధన పత్రాలను ఒకే విద్యా సంవత్సరంలో ప్రచురించినందుకు వీఐటీ ఏపీ విశ్వవిద్యాలయం వారు సర్టిఫికెట్ ఆఫ్ అప్రిసియేషన్, రూ.10 వేల బహుమతిని అందజేశారు ఈనెల 2న వీఐటీఏపీ అమరావతిలో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో ఆయన పురస్కారం అందుకు న్నారు. ఈ నేపథ్యంలో సోమవారం చిన్నవెంకటసుబ్బయ్యను అన్నమాచార్య విశ్వవిద్యాల ఉప కులపతి డాక్టర్ ఇ.సాయిబాబారెడ్డి అభినందించారు. ఆయన కృషి విశ్వవిద్యాలయానికి గౌరవం తెచ్చిపెడుతుందని ప్రశంసించారు. పరిశోధనాభివృద్ధి విభాగం డీన్ డాక్టర్ ఎన్.శివరామిరెడ్డి, హెచ్‌అండ్ఎస్ డీన్ డాక్టర్ ఓబుళపతి అభినందించారు.

రైల్వేకోడూరులో వర్షం

రైల్వేకోడూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు మండలంలో సోమవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. దీంతో వాతావరణం కాస్త చల్లబడింది. ఇటీవల మార్చి, ఏప్రిల్, మే నెలల్లో మాదిరిగా ఎండలు కాశాయి. ఆగస్టు నెల వచ్చినా వరుణుడు కరుణించడం లేదు.

ఓబులవారిపల్లె: ఓబులవారిపల్లె మండలంలో ఓ మోస్తారు వర్షం కురిసింది. సాయం త్రం నుంచి ఉరుములు, మెరుపులతో కూడి ఓ మోస్తారు వర్షం కురిసింది.

ఐరిస్ స్కానర్లు ఎక్కడ..?

- ఆచూకీ లేని 50 యంత్రాలు
- ఎండీయూ ఆపరేటర్లను వెంటాడుతున్న డీటీలు
- వాపసు చేయకుంటే రూ.6400 చెల్లించాల్సిందే..
- ట్రక్కు ఎన్‌వోసీకి లింకు పెట్టే అవకాశం

పౌర సరఫరాల శాఖ ఎండీయూ ఆపరేటర్లకు అందించిన ఐరిస్ స్కానింగ్ యంత్రాలను వాపసు తీసుకోవాలంటూ ఆ శాఖ కమిషనర్ తహసీల్దార్, సీఎస్‌డీటీలకు ఆదేశాలు జారీ చేశారు. ఇంటింటికీ రేషన్ పంపిణీలో భాగంగా వేలిముద్రలు పడని వృద్ధులు, తదితరులకు రేషన్ పంపిణీలో ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు ప్రభుత్వం ఎండీయూ ఆపరేటర్లకు విజన్‌టెక్స్ కంపెనీ ద్వారా ఐరిస్ స్కానింగ్ డివైజ్‌లను అందజేసింది. ప్రస్తుతం ఎండీయూ వాహనాలను రద్దు చేయడంతో, ఈ యంత్రాలను ఆపరేటర్ల నుంచి వాపసు తీసుకునే ప్రక్రియ ప్రారంభమైంది.

మదనపల్లె, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా రెండు నెలలుగా రేషన్ షాపులోనే కార్డుదారులకు రేషన్ పంపిణీ చేస్తున్నారు. 65 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, మంచంలో నుంచి లేవలేని వారికి మాత్రం వారి ఇళ్లవద్దకే వెళ్లి రేషన్ అందజేస్తున్నారు. ఇలాంటి వారిలో చాలామంది వేలిముద్రలను బయోమెట్రిక్ యంత్రాలు గుర్తించలేపోతున్నాయి. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ఐరిస్ స్కానింగ్ ద్వారా నమోదు చేసి నిత్యావసర వస్తువులు అందజేయాలని, ఇందుకు అవసరమైన యంత్రాలను అప్పటి ఎండీయూ ఆపరేటర్ల నుంచి స్వాధీనం చేసుకుని డీలర్లకు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు చేయడంతో తహసీల్దార్, సీఎస్‌డీటీలు ఆ పనిలో నిమగ్నమయ్యారు.

● రూ.6400 చెల్లించాల్సిందే..

జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట డివిజన్లలోని 30 మండలాల్లో అప్పటి వైసీపీ ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ పంపిణీకి 310 ఎండీయూ వాహనాలను ఏర్పాటు చేసింది. వీటిలో ప్రతి వాహనానికి ఒక్కో ఐరిస్ స్కానర్ డివైజ్ అందజేసింది. ప్రస్తుతం 250 మంది ఎండీయూ ఆపరేటర్లు వాటిని తిరిగి సీఎస్‌డీటీలకు అప్పగించగా మిగిలిన వారంతా పలు రకాల సమాధానాలు చెబుతున్నారు. అలా అంటే కుదరదని, ఇచ్చిన వస్తువును వాపసు చేయాల్సిందేనంటూ ప్రభుత్వం తెగేసి చెబుతోంది. ఒకవేళ డివైజ్ అప్పగించకుంటే రూ.6400 చెల్లించాలని షరతు విధించింది. లేకుంటే, ట్రక్కుకు ఎన్‌వోసీకి లింకు పెట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. అప్పట్లో రూ.6 లక్షల విలువ చేసే ట్రక్కును పదిశాతం లబ్ధిదారుడి వాటాతో వివిధ కార్పొరేషన్ల ద్వారా రుణం మంజూరు చేశారు. ఇప్పటికే నాలుగేళ్లకు పైగా ఈఎంఐలు చెల్లించగా, మిగిలిన మొత్తాన్ని ప్రభుత్వం ఆయా కార్పొరేషన్ల ద్వారా బ్యాంకులకు చెల్లించి క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంది. ఈ క్రమంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకుని ఎండీయూ ఆపరేటర్లుగా పని చేసిన ట్రక్కు డ్రైవర్లు వెంటనే ఐరిస్ స్కానర్లను అప్పగించాలని క్షేత్రస్థాయిలో సీఎస్‌డీటీ లు చెబుతున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే మండలాల వారీగా రేషన్ డీలర్లతో సమావేశాలు ఏర్పాటు చేసి ఈ అంశాన్ని వివరిస్తున్నారు. ఇప్పటికే అందిన ఐరిస్ స్కానర్లను ఆయా ప్రాంతాల్లో ఎక్కువ కార్డులున్న డీలర్లకు అప్పగించారు.

● 50 డివైజ్‌ల ఆచూకీ లేదు

జిల్లాలో 310 ఐరిస్ స్కానర్లను అప్పట్లో ట్రక్కు డ్రైవర్లకు అందజేయగా, ప్రస్తుతం 250 మంది వాటిని వాపసు చేశారు, మిగిలిన వారంతా తమకు ఇవ్వలేదని, తాము మధ్యలోనే నిత్యావసర వస్తువుల పంపిణీ ఆపేసి, మరొకరికి ట్రక్కును అప్పగించామని, ఎక్కడో పోయింది.. కనిపించడంలేదని ఇలా పలు విధాలుగా సమాధానం వస్తుండగా, మరికొందరు ఉపాధి నిమిత్తం బయటి దేశాలకు వెళ్లినట్లు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, అప్పట్లో పేరుకే 310 వాహనాలు ఉన్నా తర్వాత ఏడాది నుంచి 240 నుంచి 250 వాహనాలే పనిచేసినట్లు చెబుతున్నారు. మిగిలిన కొందరు వివిధ కారణాలతో రాజీనామా చేయగా, మరికొందరు మధ్యలో ఇతరులకు వాహనాన్ని అప్పగించారు. మరికొందరు, ఎండీయూను పక్కన పెట్టి వీఆర్వోల అథెంటికేషన్‌తో రేషన్‌షాపులో పంపిణీ చేశారు. మొత్తమ్మీద 240 నుంచి 250 మందికి మాత్రమే పౌరసరఫరాల శాఖ అధికారులు అప్పట్లో ఎండీయూలకు జీతాలు చెల్లించినట్లు చెబుతున్నారు. ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న డివైజ్‌లను సీఎస్‌డీటీలకు అప్పగించగా, ఇక మిగిలిన 50 డివైజ్‌లను ఎలా రికవరీ చేయాలన్నదే వారికి తలనొప్పిగా మారింది. అయితే అవి ఎక్కడ, ఎవరి వద్ద ఉన్నాయి..అసలు ఉన్నాయా? లేదా? అంటూ అధికారులు ఆరా తీస్తున్నారు. ఇందుకోసం వాటిని అప్పగించే సమయంలో జారీ చేసిన అక్విటెన్స్ ఆధారంగా వెతుకుతున్నారు.



ఐరిస్ స్కాన్ చేస్తున్న డీలర్

బాక్సింగ్ క్రీడాకారుడికి సన్మానం



బాక్సింగ్ క్రీడాకారుడు, వీఆర్‌వో జగదీశ్‌ను సన్మానిస్తున్న కలెక్టర్, జేసీ

రాయచోటి(కలెక్టరేట్), ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బాక్సింగ్ విభాగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు సాధించిన నందలూరు గ్రామ వీఆర్‌వో జగదీశ్‌ను సోమవారం మధ్యాహ్నం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాక్సింగ్ విభాగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాలు పొందిన ఎం.జగదీశ్ క్రీడల్లో ఎంతో మందికి ఆదర్శప్రాయమన్నారు. అన్నమయ్య జిల్లా యువత జగదీశ్‌ను ఆదర్శంగా తీసుకొని అన్ని రకాల క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగేలా కృషి చేయాలన్నారు. ఈయనకు పతకాలు పొందే లా శిక్షణ ఇచ్చిన ఆయన కోచ్ ఆనంద్‌ను కూడా ఈ సందర్భంగా సన్మానించి మరింత మంది క్రీడాకారులు ఈ స్థాయికి ఎదిగేలా కృషి చేయాలని సూచించారు.

వాచ్‌మెన్ వేతనాల బకాయిలు చెల్లించాలి

● ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి నరసింహులు

పీలేరు రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న వారికి ఐదు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, వెంటనే బకాయిలు చెల్లించాలని ఏఐటీయూసీ పీలేరు నియోజక వర్గ ప్రధాన కార్యదర్శి కే. నరసింహులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం పీలేరు ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హైస్కూళ్లలో 5333 మంది నైట్ వాచ్‌మెన్‌గా రూ.6 వేల గౌరవ వేతనానికి పని చేస్తున్నారని తెలిపారు. ఐదు నెలలుగా ప్రభుత్వం గౌరవ వేతనం ఇవ్వక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే జిల్లా విద్యాశాఖ అధికారిని కలసి బకాయిలు చెల్లించాలని కోరినా, ఇప్పటి వరకూ ఆ దిశగా ఎటువంటి ముందడుగు పడలేదని తెలిపారు. వెంటనే బకాయిలు చెల్లించకపోతే ఏఐటీయూసీ తరఫున పోరాటం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు డీ. యశోద, టీ. రమణ, పీ. రెడ్డెప్ప, బీ. చిన్నప్ప పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



సునీరం హింబ్రం మృతదేహం

నిమ్మనపల్లి ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలు లాగుతుండగా షాక్ తగలడంతో స్తంభం పైనుంచి పడి గాయపడిన ఓ కూలీ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు ఎస్ఐ తిప్పేస్వామి కథనం మేరకు మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీలో పశ్చిమ బెంగాల్ రాష్ట్రం, దినాజ్పూర్ జిల్లా, బన్సిహరి పంచాయతీ, రూపహత గ్రామానికి చెందిన సునీరం హింబ్రం(30) విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులకు కూలీగా వచ్చాడు. గత బుధవారం తీగలు లాగుతుండగా, హఠాత్తుగా విద్యుత్ ప్రసారం కావడంతో అతను స్తంభం పైనుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతనిని మదనపల్లి ఏరియా ఆసుపత్రి తీసుకెళ్లగా అక్కడి డాక్టర్లు తిరుపతి రుయాకు రెఫర్ చేశారు, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తెలిపారు మృతునికి మూడేళ్ల క్రితం పెళ్లికాగా భార్యతో పాటు ఇద్దరు పిల్లలు వున్నారు. అతని తమ్ముడు గోపాల చంద్ హిమ్ర్బం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కడప రిమ్స్‌లో ..

రామాపురం, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. రామాపురం మండలం కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ హరిజనవాడకు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రామాపురం మండలం సరస్వతిపల్లి గ్రామానికి చెందిన బోనంశెట్టి రవీంద్ర (56) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతనిని కడపలోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రవీంద్రకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాయిదాలకు హాజరు కానందుకు అరెస్ట్



పోలీసుల అదుపులో చంద్రరమేష్

నందలూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కోర్టు వాయిదాలకు హాజరు కానందుకు ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు తిరుపతి పట్టణం కరకంబేడు వీధికి చెందిన చంద్రరమేష్ రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులో నిందితుడు. వాయిదాలకు హాజరు కాకపోవడంతో నందలూరు కోర్టు అతనిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. దీంతో నిందితు డినిఅదుపులోకి తీసుకుని సోమవారం నందలూరు కోర్టులో హాజరుపరచగా, రిమాండ్‌కు రాజంపేట సబ్‌జైలుకు తరలించినట్లు తెలి పారు.

కొరియర్ వాహనం అదుపు తప్పి బోల్తా..

సిద్దవటం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : కొరియర్ వాహనం అదుపు తప్పి వాహనం బోల్తాపడడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. కడప నుంచి బద్వేలుకు కొరియర్ పార్శిళ్లు తీసుకెళుతున్న వాహనం సోమవారం స్థానిక పరమాత్మ సేవా వృద్ధాశ్రమం సమీపంలో అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని, వంకలో పడిపోయింది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న కిశోర్, చాంద్‌బాషా స్వల్పంగా గాయపడ్డారు. 108లో వారిని కడప రిమ్స్‌కు తరలించారు. ఎస్ఐ మహమ్మద్‌రఫీ ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేస్తున్నారు.

తరగతి గదిలో జారి పడి విద్యార్థికి గాయాలు

● పట్టించుకోని ఉపాధ్యాయులు



గాయపడిన మల్లికార్జున

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తరగతి గదిలో కాలు జారిపడడంతో ఓ విద్యారి గాయపడ్డాడు. మండలంలోని బూర్లపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆవులరెడ్డిపలె ్లకు చెందిన ఆవుల తిప్పారెడ్డి, కవిత తంపతుల కుమారుడు ఆవుల మల్లికార్జున 6వ తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం తరగతి గదిలో ప్రమాదవశాత్తు కాలు జారి పడడంతో అతని చెయ్యి విరిగింది. గమనించిన తోటి విద్యార్థులు ఫోన్ చేయడంతో 108 వాహన పైలెట్ రాజు, ఈఎంటీ సాంబశివ విద్యార్థిని బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు. అక్కడి వైద్యులు పరిక్షించి మెరుగైన వైద్యం కోసం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. విద్యార్థికి గాయాలైనా ప్రధానోపాధ్యాయుడు కానీ, ఉపాధ్యాయులు కానీ పట్టించుకోలేదని విద్యార్థి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల నిర్లక్ష్యంపై గ్రామస్తులు, విద్యార్థి తల్లి దండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆటో ఢీకొని వృద్ధురాలి మృతి

కలికిరి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వెనుకనుంచి ఆటో ఢీకొనడంతో ఓ వృద్ధురాలు చెందింది. కేవీ పల్లె మండలం నూతనకాల్వ దండువారిపల్లెకు చెందిన చింతపర్తి మంగమ్మ (82) కలికిరిక్రాస్ రోడ్డులోని మనుమరాలి ఇంటికి వచ్చింది. సోమవారం ఉదయం మనుమరాలితో కలిసి దీప్తి బట్టల దుకాణం వద్ద నడిచి వెళుతుండగా వెనుక నుంచి ఆటో ఢీకొంది. దీంతో రోడ్డుపై పడిన ఆమె తలకు బలమైన గాయమైంది. అదే ఆటోలో సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళగా ప్రాథమిక చికిత్స చేసి, తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం మరణించినట్లు హెడ్ కానిస్టేబుల్ మదనమోహన రెడ్డి చెప్పారు. కుమార్తె రామకుమారి ఫిర్యాదు ఆటో డ్రైవరు సుబహాన్ మీద కలికిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సర్వే సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలి

● సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్



సర్వే సమస్యలపై డీఐలతో సమీక్షిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజల నుంచి వచ్చిన సర్వే సమస్యలన్నింటికీ వారం రోజుల్లో పరిష్కారం చూపాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో మదనపల్లె, తంబళ్లపల్లె డీఐ (డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే)లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ భూ వివాదాలు, ఇతర కారణాలతో డివిజన్‌లోని 11 మండలాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు సర్వేకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. నిర్దేశిత సమయంలో వాటిని పరిష్కరించడంలో ఎందుకు ఆలస్యం అవుతోందని ప్రశ్నించారు. ప్రతి మండలాన్ని పరిశీలించి, విలేజ్ సర్వేయర్లతో సమీక్ష నిర్వహించి వెంటనే సర్వే సమస్యలను పరిష్కరించాలని సూచించారు. మదనపల్లె మండలంలో ఎక్కువగా సర్వేలు పెండింగ్ ఉన్నాయని ప్రశ్నించగా, మండల సర్వేయర్ సరిగ్గా స్పందించడం లేదని డీఐ బదులిచ్చారు. మదనపల్లె మం డల సర్వేయర్‌పై విచారణ చేసి నివేదికలు ఇవ్వాలని సబ్‌కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె, తంబళ్లపల్లె డీఐలు వెంకటరమణనాయుడు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్రికెట్ టోర్నీ విజేత పీలేరు



పీలేరు జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

పీలేరు రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతగా పీలేరు . రన్నర్స్‌గా రాజంపేట జట్టు నిలిచాయి. యూటీఎఫ్ 51వ ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయి ఉపాధ్యాయుల క్రికెట్ టోర్నమెంట్, చెస్ పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన నాలుగు జట్లు టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనపర్చిన పీలేరు జట్టు కప్పు కైవసం చేసుకుంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా జోహార్ నిలిచారు.

చెస్ పోటీ విజేత నాగేంద్ర....

చదరంగం పోటీ విజేతగా రాజంపేటకు చెందిన రాజేంద్ర నిలిచారు. మొత్తం 20 మంది మధ్య ఆసక్తికర పోటీ సాగింది. ఇందులో రాజేంద్ర విజేత కాగా, ద్వితీయ స్థానంలో కలకడకు చెందిన సుబ్బరాయుడు నిలిచారు. విజేతలకు అన్నమయ్య జిల్లా యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు హరిప్రసాద్ మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం, మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. ప్రతి ఏటా జిల్లాలోని ఏదో ఒక ప్రాంతంలో ఉపా ధ్యాయుల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు సుధాకర్ నాయుడు, ట్రెజరర్ బీ. చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు అక్రమ బాషా, రమణ మూర్తి, జిల్లా క్రీడా విభాగపు కన్వీనర్ సుధాకర్, రొంపిచెర్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం. రెడ్డిప్రదీప్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు నరసరాజు, వివిద మండ లాల యూనియన్ నాయకులు పీరయ్య, వెంకటరమణ, విజయ్ కుమార్, రాజు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం



ఎగ్ కార్టును ప్రారంభిస్తున్న డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ

సంబేపల్లె, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): మహిళా పేదిరక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ తెలిపారు. పేదరిక నిర్మూలన సంస్థ, నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ సౌజన్యంతో గున్నికుంట్ల గ్రకామంలోని వినాయక స్వయం సమాయక సంఘం అందజేసిన ఎగ్ కార్ట్‌ను సోమవారం పీడీ సత్యనారాయణ ప్రారంభించారు. యాభై వేల రూపాయలు విలువ చేసే ఎగ్ కార్ట్‌ను వినాయక ఎస్‌హెచ్‌జీ సభ్యురాలైన రాజేశ్వరికి ఉచితంగా అందజేశారు. నెలకు ఇరువై నుండి ఇరవై అయిదు వేల రూపాయల ఆదాయం పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డీపీయం ప్రసాద్‌రెడ్డి, వేణుమాధవ, రమేశ్, గంగార్జున, సంజీవ రాజు, సీసీ నాగరాజురావు, ఇతర ప్రాజెక్టు సిబ్బంది పాల్గొనడం జరిగింది.

నేడు ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

రాజంపేట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి మంగళవారం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వై.సుదాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైనవారు ఉదయం 10 గంటలకు పదో తరగతి మార్కుల లిస్టు, టీసీ, స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు తదితర ధ్రువపత్రాలతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు రావాలన్నారు. ప్రవేశం పొందిన విద్యార్థులు రూ.6 వేలు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఉపాధి, ఉన్నత విద్యావకాశాలు మెండుగా ఉన్న ఈ కోర్సుల్లో ప్రవేశం పొంది తమ భవిష్యత్‌కు మార్గం సుగమం చేసుకోవాలని కోరారు.

గ్రామాల్లో వ్యర్థాల సేకరణకు 'స్వచ్ఛ రథం'

● జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా పీలేరు ఎంపిక ● ఎండీయూ ఆపరేటర్లకు ఉపాధి



గుంటూరు జిల్లాలో ప్రారంభించిన స్వచ్ఛరథం

మదనపల్లె టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి, వాటిని రీసైక్లింగ్ చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకం ప్రవేశపెట్టింది. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆదేశాలతో గుంటూరు జిల్లాలో స్వచ్ఛ రథం పైలట్ ప్రాజెక్టు ప్రవేశపెట్టారు. ప్రతి జిల్లాలో ఒక గ్రామ పంచాయతీని పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలన్న పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలతో జిల్లాలోని పీలేరు మేజర్ పంచాయతీని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఎంపిక చేసినట్లు డీపీవో రాధమ్మ తెలిపారు. ఎండీయూ ద్వారా రేషన్ పంపిణీని కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో.. తమకు జీవనాధారం కల్పించాలని ఆపరేటర్లు ప్రభుత్వానికి విన్నవించుకున్నారు. ఈ సమస్య పరిష్కరించడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిలో కలసిపోకుండా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛరథం కార్యక్రమం ప్రారంభించి వారికి ఉపాధి కల్పించనుంది.

చెత్తకు బదులుగా నిత్యావసర వస్తువులు

గ్రామాల్లో ప్లాస్టిక్, గాజు సీసాలు, పాత ఇనుప సామాన్లకు బదులుగా నిత్యావసర వస్తువులైన సబ్బులు, షాంపూలు, గోధుమ పిండి, ఎర్రగడ్డలు, కందిపప్పు తదితర వస్తువులను పంపిణీ చేస్తారు. ఎండీయూ ఆపరేటర్ ప్రజల నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలు, గాజు పెంకులు, అట్టపెట్టెలు, పాత ఇనుప సామాను తదితరాలను సేకరించి కిలోకు కొంత మొత్తం చొప్పున చెల్లిస్తారు. అయితే, నగదుకు బదులు ఇంట్లోకి అవసరమయ్యే వస్తువులను ఇస్తారు.

ఎండీయూ ఆపరేటర్‌కు నెలకు రూ.25 వేలు వేతనం

స్వచ్ఛరథం నిర్వహించే ఎండీయూ ఆపరేటర్‌కు ఆయా గ్రామ పంచాయతీ జనరల్ నిధుల నుంచి ప్రతి నెలా రూ.25 వేలు చెల్లించనున్నారు. స్వచ్ఛరథం వీధుల్లో తిరుగుతూ ప్రజల నుంచి పొడి చెత్త (ప్లాస్టిక్, గాజు, ఇనుప వ్యర్థాలను) కేజీల లెక్కన తీసుకుంటారు. ఈ చెత్తను స్వచ్ఛరథంలో అమర్చిన అరల్లో ఉంచి, ఆ చెత్త ఎంత విలువ చేస్తుందో లెక్కించి పక్కనే ఉన్న నిత్యావసర వస్తువులను లెక్కవేసి ప్రజలకు చెల్లిస్తారు. ఈ విధానంలో సత్ఫలితాలు వస్తే ప్రతి మండల కేంద్రంలోనూ స్వచ్ఛరథం ఏర్పాటుకు ప్రభుత్వం ఆలోచనలో ఉంది.

పీలేరుకు స్వచ్ఛరథం కేటాయింపు

జిల్లాలోని మేజర్ పంచాయతీ అయిన పీలేరుకు స్వచ్ఛరథం కేటాయించేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉంది. పీలేరు గ్రామ పంచాయతీలో 10,755 కుటుంబాలకు గాను 41,503 మంది నివసిస్తున్నారు. ఈ పంచాయతీ నుంచి నిత్యం ఐదు ట్రాక్టర్లతో చెత్త సేకరిస్తుండగా వీటిలో 390 కిలోల పొడి చెత్త, 600 కిలోల తడి చెత్త వస్తోంది. ఈ చెత్తంతా కంపోస్టు యార్డులో వ్యర్థంగా పడేయకుండా, ఇప్పుడు ప్రవేశపెట్టనున్న స్వచ్ఛరథం వద్ద విక్రయిస్తే అటు ప్రజలకు ఆదాయం, ఇటు జీవ వైవిధ్యం కాపాడినట్లు అవుతుంది. ఈ వినూత్న విధానం విజయం సాధిస్తుందని నమ్మకం వుంది.

-రాధమ్మ, జిల్లా పంచాయతీ అధికారిణి, రాయచోటి

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులతో పీడీ పద్మావతి

ఓబులవారిపల్లె, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిదిలోని చిన్నఓరంపాడు జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు తమిళనాడులో జరిగిన ఆలిండియా టెన్నిస్‌బాల్ క్రికెట్ చాంపియన్‌షిప్ 2025లో ప్రతిభ కనబరచినట్లు ప్రధానోపాధ్యాయురాలు బుజ్జమ్మ తెలిపారు. తమిళనాడులోని తిరువల్లూరు జిల్లా టెన్నిస్‌బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలో పదో తరగతి విద్యార్థినులు భాను, సారా మూడో బహుమతిని సాధించారన్నారు.

ఎనిమిది మంది పాత నేరస్థుల బైండోవర్

మదనపల్లె అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పలు కేసుల్లో నిందితులుగా ఉన్న ఎనిమిది మందిని పోలీసులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ వద్ద బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ సమాజంలో సత్‌ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. ఇకపై నేరాల జోలికి వెళ్లకూడదని వారిని హెచ్చరించారు. పాత నేరస్థుల నుంచి సంతకాలు తీసుకుని పంపివేశారు.

పంట బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

సిద్దవటం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : పంటల బీమా కోసం ఈనెల 14 లోపు రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఉద్యాన శాఖాధికారి జయభరత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బొగ్గిడివారిపల్లెలో ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి పసల్‌బీమా యోజన కింద పసుపు, ఉల్లి పంటలకు బీమా ప్రీమియం చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 14 వరకు గడువు పొడిగించిందన్నారు. మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

అప్పుడే నూరేళ్లు నిండిపోయాయా..

- భోరున విలపించిన కుటాగుళోళ్లపల్లె
- అశ్రునయనాల మధ్య రోడ్డు ప్రమాద మృతుల అంత్యక్రియలు



కుటాగుళోళ్లపల్లెలో మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబీకులు

ములకలచెరువు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రే.. లేవరా నాన్నా.. అక్క వచ్చింది.. నాన్న పిలుస్తున్నాడు.. బాబాయ్ వచ్చాడు.. ఒక్కసారి లేవరా.. అంటూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుల కుటుంబ సభ్యులు గుండెలు పగి లేలా రోదిస్తున్న దృశ్యాలు కలచి వేశాయి. ములకలచెరువు మండలం పెద్ద పాళ్యం ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వేపూరికోట పంచాయతీ కుటాగుళోళ్లపల్లెకు చెందిన యువకులు వెంకటేష్(26), తరుణ్(24), మనోజ్(19) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. పోస్టుమార్టం అనంతరం వారి మృతదేహాలను సోమవారం స్వగ్రామానికి తీసుకు రావడంతో చివరి చూపు చూసేందుకు గ్రామం మొత్తం తరలివచ్చింది. తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి వెళ్ళి యువకుల కుటుంబాలకు పరామర్శించారు. గ్రామానికి వచ్చి అంత్యక్రియలకు హాజరయ్యారు.

ఒక్కో కుటుంబానిది.. ఒక్కో దీనగాథ

వ్యవసాయ కూలీలైన కుటాగుళోళ్లపల్లె చంద్రప్ప, రత్నమ్మ దంపతులు కుమార్తె సుజాతకు ఐదేళ్ళ క్రితం పెళ్ళి చేశారు. డిగ్రీ వరకు చదువుకున్న కుమారుడు వెంకటేశ్ ఇంటి వద్దే ఉంటూ ఉద్యోగాల కోసం అన్వేషిస్తున్నాడు. వేమనారాయణ, శ్యామలమ్మ దంపతులు కూడా వ్యవసాయ కూలీలే. వీరి పెద్ద కుమారుడు కేశవ బెంగళూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా, తరుణ్ ఐటీఐ పూర్తి చేసి ఉద్యోగం వెతుకుతూ ఇంటివద్దే ఉంటున్నాడు. బెంగళూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న ఓబులేసు, కవిత దంపతులకు ఇద్దరు కూతుళ్లుండగా, కుమారుడు మనోజ్ బెంగళూరులో బీటెక్ చదువుతున్నాడు. వీరంతా ఉద్యోగాలు సాధించి కుటుంబాలకు అండగా నిలుస్తారని బావిస్తున్న తరుణంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు.

ఒకే రాత్రి నలుగురు దుర్మరణం

మండలంలో ఆదివారం రాత్రి కాళరాత్రిగా మారింది. ముంబాయి - చెన్నై జాతీయ రహదారిలోని పెద్దపాళ్యం వద్ద జరిగిన ప్రమాదంలో వేపూరికోట పంచాయతీ కుటాగుళోళ్లపల్లెకు చెందిన యువకులు వెంకటేష్, తరుణ్, మనోజ్ దుర్మరణం చెందారు. ఈ సంఘటన జరిగిన గంట వ్యవధిలోనే బురకాయలకోట పంచాయతీ ఎర్రమాసివారిపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు ములకల చెరువు నుంచి ద్విచక్రవాహనంలో తిరిగి వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో దుర్మరణం పాలయ్యాడు. శ్రీనివాసులు నాయుడు రైతు. ఇతనికి భార్య నిర్మల, ఇద్దరు కుమారులు వెంకటేష్, బాలాజీ ఉన్నారు. పెద్దకుమారుడు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, చిన్న కుమారుడు బాలాజీ డిగ్రీ చదువుతున్నాడు. టీడీపీ నేతలు గుత్తికొండ త్యాగరాజు, ఎర్రగుడి సురేష్, కేవీ రమణ, మూగి రవిచంద్ర, ముత్తుకూరు మౌలా, జేసీబీ సుధాకర్‌నాయుడు, విజయ్‌కుమార్, రామకృష్ణమ రాజు, అశోక్ కుమార్, భాస్కర్‌రెడ్డి, రెడ్డెప్ప తదితరులు ప్రగాడ సానుభూతిని తెలియజేయడంతోపాటు, గ్రామంలో అంత్యక్రియలకు హాజరయ్యారు.

పెళ్లి చేసుకుంటానని మోసం... వ్యక్తిపై కేసు నమోదు

చెన్నూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి గర్భిణిని చేసి.. మోసగించిన వ్యక్తిపై ఓ మహిళ సోమవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు విచారణ చేస్తున్నట్లు సీఐ క్రిష్ణారెడ్డి తెలిపారు. సీఐ వివరాల మేరకు.. చెన్నూరు వనంవీధికి చెందిన పెరుగు శివశంకర్‌కు ఓ మహిళతో ఐదేళ్లక్రితం పరిచయమైంది. పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి నమ్మించి 17 తులాల బంగారు, 7లక్షల డబ్బులు తన జల్సాలకు వాడుకున్నాడు. ప్రస్తుతం ఆమె నాలుగు నెలల గర్భిణి.. వివాహం చేసుకోమని అడిగితే.. గత నెల 21న ఇంటి నుంచి బయటికి వెళ్లిపోయాడని.. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎక్కడ ఉండాడో తెలియడం లేదని.. తనకు న్యాయం చేయాలంటూ బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కొండపేటలో ఘర్షణ ... కేసు నమోదు

కలసపాడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపేటలో సోమవారం జరిగిన ఘర్షణపై ఇరు కుటుంబాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిమోతి తెలిపారు. స్థలం విషయంలో జక్కల మరియమ్మ, జక్కల ఆదిలక్షుమ్మ కుటుంబాల మధ్య ఘర్షణ జరిగి ఇరు కుటుంబాల వారు ఒకరిపై ఒకరు కర్రలు, రాళ్లతో దాడి చేసుకున్నారు. దాడిలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇరు కుటుంబాల ఫిర్యాదు మేరకు జక్కల మరియమ్మ, జయన్న, భాస్కర్, జక్కల ఆదిలక్షుమ్మ, ఇండ్ల జయరాములు, రమేష్ తదితరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఘర్షణ కేసులో ముగ్గురు అరెస్టు

కడప క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని భగత్‌సింగ్‌కాలనీలో జరిగిన ఘర్షణ కేసుకు సంబంధించి ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. మనస్పర్థల కారణంగా జూలై 28న రాజు ఇంటిలోకి జొరబడి సంపత్, గణేశ్, శివలు దాడి చేశారు. ఇంటిలోని వస్తువలన్నీ చిందర వందర చేశారు. ఈ ఘటనలో నిందితులైన ముగ్గురిని ఎస్ఐ తులసి నాగప్రసాద్ తమ సిబ్బందితో కలిసి సోమవారం అరెస్టు చేశారు.

సబ్‌స్టేషన్ ఆపరేటర్‌పై దాడి



గాయపడిన సురేష్

మైదుకూరు రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆదిరెడ్డిపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్ సురేష్‌పై అదే గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రావు దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రమణారెడ్డి తెలిపారు. సోమవారం తెల్లవారుజామున నాగేశ్వర్‌రావు అనే వ్యక్తి సబ్‌స్టేషన్ వద్దకు వచ్చి బిల్లులు బాగా వసూలు చేస్తారు.. కరెంటు ఎందుకు వదలలేదంటూ వాగ్వాదానికి దిగి సురేష్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో గాయపడిన సురేష్‌ను స్థానికులు 108 వాహనం ద్వారా ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జిల్లాకు 1,321 టన్నుల యూరియా


కడప రైల్వేస్టేషన్‌లో ఎరువులను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రనాయక్ తదితరులు

కడప రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ వ్యవసాయ అవసరాల కోసం సోమవారం కడప రైల్వేస్టేషన్‌కు 1,321 టన్నుల యూరియా వచ్చింది. వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రనాయక్ డీఏవోలు, కంపెనీ ప్రతినిధులు రైల్వేస్టేషన్ వద్దకు చేరుకుని కేటాయించిన పరిణామాలను ఆ యా జిల్లాలకు సరఫరా చేశారు. ఇందులో వైఎస్సార్ కడప జిల్లాకు 942 టన్నులు రాగా వాటిలో 516 టన్నులు ప్రైవేట్ డీలర్లకు, 426 టన్నులు మార్క్‌ఫెడ్‌కు తరలించారు. అలాగే అన్నమయ్య జిల్లాకు 380టన్నులు రాగా అందులో ప్రైవేట్ డీలర్లకు 145 టన్నులు, మార్క్‌ఫెడ్‌కు 235 టన్నులు పంపిణీ చేశారు.


చిత్తూరు బాలల హోంలో పిల్లలను అప్పగిస్తున్న పూతలపట్టు పోలీసులు

పిల్లలను వదిలేసిన తల్లిదండ్రులు?

- కలికిరికి చెందిన వారిగా పోలీసుల గుర్తింపు

కలికిరి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం పి.కొత్తకోట బస్‌స్టాప్ వద్ద సోమవారం సాయంకాలం ఇద్దరు పిల్లలను తల్లిదండ్రులే వదిలేసి వెళ్లినట్లు పూతలపట్టు పోలీసులు గుర్తించారు. ఈ ఇద్దరు పిల్లలు కలికిరి గ్రామానికి చెందిన వారుగా కూడా పోలీసులు గుర్తించారు. కలికిరి గ్రామానికి చెందిన పిల్లల తల్లి దండ్రులు పండమ్మ, సునీల్ పిల్లలిద్దరినీ ఆటోలో తీసుకెళ్లి పి.కొత్తకోట బస్‌స్టాప్ వద్ద వదిలి వెళ్లిపోయినట్లు పూతల పట్టు పోలీసుల సమాచారం. ఇద్దరు పిల్లలు వెంటేష్ (3వ తరగతి), లక్ష్మణ్ (2వ తరగతి) అని మాత్రమే పూతలపట్టు పోలీసులు సమాచారం రాబట్టకలిగారు. పిల్లలు కూడా తమది కలికిరి గ్రామమని మాత్రమే చెప్తున్నట్లు తెలిసింది. దీంతో చిత్తూరు జిల్లా ఎస్పీ కార్యాలయం కలికిరి పోలీసులను అప్రమత్తం చేశారు. కలికిరి పోలీసులు పట్టణ శివార్లలో సంచారవాసులు నివసిస్తున్న ప్రాంతాల్లో వివరాల కోసం ప్రయత్నిస్తున్నారు. ఈ లోగా పూతలపట్టు పోలీసులు పిల్లలిద్దరినీ చిత్తూరు బాలల హోంకు తరలిస్తున్నట్లు కలికిరి పోలీసులకు తెలిపారు. మొత్తానికి ఈ ఇరువురు పిల్లలూ అన్నమయ్య జిల్లా కలికిరి మండలం కలికిరి గ్రామానికి చెందిన వారా లేక చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం కలికిరికి చెందిన వారా అనేది స్పష్టం కాలేదు.

రైతుల ఆలోచనలను పరిగణలోకి తీసుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

సీకేదిన్నె, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆలోచనలను శాస్త్రవేత్తలు పరిగణలోకి తీసుకుని పంటల సాగులో అమలు పరచడం ద్వారా ఉత్తమ ఫలితాలు లభిస్తాయని జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు బి.చంద్రానాయక్ తెలిపారు. వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ వ్యవసాయ పరిశోధన స్థానంలో సోమవారం రైతులు, శాస్త్రవేత్తలతో ముఖాముఖి చర్చావేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎన్నో ఏళ్లుగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తూ వ్యవసాయంలో ఎప్పుడు ఏమి చేయాలో తెలుసుకుని ఉంటారని... వారి ఆలోచలను కార్యరూపంలో పెడితే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చన్నారు. రైతులే శాస్త్రవేత్తలుగా పంటలకు రక్షణగా నిలస్తారని.. అందుకు సాంకేతిక సహకారం అందించాల్సిన బాధ్యత శాస్త్రవేత్తలపై ఉందన్నారు.

వ్యవసాయ పరిశోధన శాస్త్రం ప్రధాన శాస్త్రవేత్త ప్రభాకర్‌రెడ్డి, కేవీకే కోఆర్డినేటర్ వీరయ్యలు రైతులకు, శాస్త్రవేత్తలు అందించాల్సిన సూచనలు గురించి వివరించారు. శాస్త్రవేత్తలు సునీల్‌కుమార్, శ్రీవల్లి, మాధురి వివిధ పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులతో కలిసి చర్చించారు. వరి, పసుపు, పత్తి, వేరుశనగ, మినుము తదితర పంటల్లో ఏ సమయంలో ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో రైతులతో సమగ్రంగా తెలుసుకున్నారు. ఆత్మా పీడీ విజయలక్ష్మి పంటల్లో అధిక దిగుబడులు పొందేందుకు జాగ్రత్తలు గురించి వివరించారు. బీఆర్‌సీ ఏడీఏలు రమణారెడ్డి, అశోక్‌రెడ్డి, ఏవోలు పద్మజ, సుచిత్ర, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తాం : డీఈవో


ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న డీఈవో షంషుద్దీన్

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చెన్నంరాజుపల్లె జడ్పీ హైస్కూలులో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తామని డీఈవో షంషుద్దీన్ తెలిపారు. శనివారం జరిగిన అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు గ్రామ ప్రజలు జడ్పీ హైస్కూలులో విద్యార్థులకు మౌళిక వసతులు కల్పించాలని వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం డీఈవో పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సుబ్బయ్య పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉందని, అదనపు తరగతి గదులు నిర్మించాలని, టాయిలెట్లు, కాంపౌండ్‌వాల్ ఏర్పాటు చేయాలని కోరారు. పాఠశాలలో సౌకర్యాలు కల్పిస్తే చుట్టుపక్కల విద్యార్థులు పాఠశాలలో చేరి విద్యార్థుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. దీనిపై స్పందించిన డీఈవో స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్‌తో మాట్లాడి మౌలిక వసతులు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులతో పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో-2 శోభారాణి, పాఠశాల హెడ్‌టీచర్ వెంకటరమణ, ఉపాధ్యాయులు, సీఆర్‌పీ భాస్కర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పేదలకు భూములు పంపిణీ చేయాలి



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

బద్వేలు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): బద్వేలు నియోజకవర్గంలోని కాశినాయన మండలం, వరికుంట్ల, నాయనపల్లె, ఆకుల నారాయణపల్లె, సావిశెట్టిపల్లె, అక్కెంగుండ్ల, ఇటుకలపాడు గ్రామాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదలకు భూమి, ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నేళ్ల నుంచి ఈ గ్రామాలలోని నిరుపేదలకు స్వంత భూమి లేక కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారని, కరువు వచ్చినపుడు ఇతర ప్రాంతాలకు వలసపోతున్నారని వాపోయారు. ఇతర ప్రాంతాల వారు ప్రభుత్వ భూములను కబ్జా చేసి ఫామ్‌హౌస్‌లు నిర్మించుకుంటున్నారని, అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు పి.అన్వేష్ మాట్లాడుతూ పేదలు సాగు చేసుకుంటున్న భూములను సైతం కబ్జాదారులు దౌర్జన్యంగా లాక్కుంటున్నారని, పేదలకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ప్రజలపక్షాన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జకరయ్య, పోలయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర దర్యాప్తుతో చెత్త వసూళ్ల అక్రమాలను నిగ్గుతేల్చాలి


విశ్వేశ్వరనాయుడుకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ సభ్యులు

కడప సెవెన్ రోడ్స్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): చెత్త పన్ను వసూళ్లలో కడప మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కోట్లాది రూపాయల అవినీతి జరిగిన నేపథ్యంలో అక్రమాలను నిగ్గు తేల్చాలని సీపీఐ నగర కార్యదర్శి ఎస్.వెంకటశివపేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడుకు సీపీఐ ప్రతినిధి బృందం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెంకటశివ మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆదేశాల మేరకు జగన్ ప్రభుత్వం కరోనా కష్టకాలంలో చెత్త వసూళ్లు చేసేందుకు నిర్ణయించారన్నారు. చెత్త బుట్టల కొనుగోళ్లలో, చెత్త బండ్ల ఏజెన్సీ కాంట్రాక్టర్‌కు జనరల్ ఫండ్ నుంచి దాదాపు డబ్బులు చెల్లించి పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు జరిగాయన్నారు. దీనిపై ఉన్నతస్థాయి దర్యాప్తు చేపట్టి నిజాలను వెలికితీయాలన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ


కొత్తమాధవరంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

ఒంటిమిట్ట, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఒంటిమిట్ట, కొత్తమాధవరం గ్రామాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ పరిశీలించారు. ఈనెల 12న జరగనున్న జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. సోమవారం మధ్యాహ్నం మండలంలోని కొత్తమాధవరం, ఒంటిమిట్ట ఉన్నత పాఠశాలల్లో ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించి.. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఎన్నికల సందర్భంగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ బాబు, ఇన్‌చార్జి ఎస్ఐ రఫీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

34 మంది గ్రేడ్-2 వీఆర్వోల బదిలీ

కలికిరి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో మరో 34 మంది గ్రేడ్-2 వీఆర్వోలను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ సోమ వారం ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 26న 45 మంది గ్రేడ్-1 వీఆర్వో లను బదిలీ చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో మదనపల్లె నుంచి 10 మంది వీఆర్వోలను బదిలీ చేయగా తాజాగా అక్కడి నుంచి మరో 9 మంది గ్రేడ్-2 వీఆర్వోలను బదిలీ చేశారు. మిగిలిన వారిలో గుర్రంకొండ, రామసముద్రం మండలాల నుంచి నలుగురు వంతున బదిలీ అయ్యారు.

అదే విధంగా వాల్మీకిపురం, కలకడ, కురబలకోట మండలాల నుంచి ముగ్గురేసి వంతున బదిలీ జరిగింది. మొలకలచెరువు, పీటీఎం మండలాల నుంచి ఇద్దరు వంతున, కలికిరి, సుండుపల్లె నుంచి ఒక్కొరి వంతున బదిలీ చేశారు. ఇక చిత్తూరు జిల్లా నుంచి బదిలీ మీద జిల్లాకు వచ్చిన ఇద్దరికి కూడా మండలాలు కేటాయించారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి

రాజంపేట టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం నారంరాజుపల్లె జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో 11వ తరగతి ప్రవేశానికి అర్హులైనవారు ఈనెల 10 లోపుల దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గంగాధరన్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పాసైన విద్యార్థులు వారి బయోడేటాతో పదో తరగతి మార్కులిస్టు జిరాక్స్ కాపీ ఒక జత చేసి జవహర్ నవోదయ విద్యాలయ మెయిల్‌కు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. పదో తరగతిలో మార్కుల శాతాన్ని బట్టి సీట్లు కేటాయించడం జరుగుతుందని తెలిపారు.

విశ్వవిద్యాలయ ప్రగతి ప్రధానం.. వీసీ


మాట్లాడుతున్న వీసీ అల్లం శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాబోయే తరాలకు ఉజ్వల భవిష్యత్తును ఇచ్చి దేశ ప్రగతికి దోహదపడనున్న విశ్వవిద్యాలయ ప్రగతి మనకు ప్రధాన అజెండా అని యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం ఆయన వివిధ విభాగాల డీన్‌లు, అన్ని విభాగాల అధిపతులతో ఆయన తన చాంబర్‌లో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం ప్రొఫెసర్‌షిప్‌కు ఎంపికైన స్పోక్ ఇన్‌స్టిట్యూషన్‌లో యోగి వేమన విశ్వవిద్యాలయం కూడా ఒకటని తెలిపారు. ఇక్కడి నుంచి ఒక ప్రొఫెసర్ ఎంపిక అవుతారని.. వారి పరిశోధనకు రూ.30లక్షల నిధులు ఇస్తారని వివరించారు. ఒక కమిటీ ద్వారా ప్రొఫెసర్‌ని ఎంపిక చేస్తామన్నారు. విశ్వవిద్యాలయంపై అధికారుల మీద అసత్య ఆరోపణలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను కోరుతామన్నారు. వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, ప్రొద్దుటూరు వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జయరామిరెడ్డి, డీన్‌లు, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయ ప్రతిష్టకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదు

కొన్ని విద్యార్థి సంస్థలు పనిగట్టుకొని విశ్వవిద్యాలయ పరువు ప్రతిష్టలకు భంగం కలిగిస్తూ అభివృద్ధికి విఘాతం కలిగిస్తూ వ్యవహరిస్తుండడం ఆవేదనకు గురిచేస్తోందని వైవీయూ వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు అన్నారు. దేశస్థాయిలో నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ఫ్రేమ్‌వర్క్‌లు వందలోపు ర్యాంకు, న్యాక్ ఏ గ్రేడ్‌తో అత్యున్నత పరిశోధన ప్రమాణాలతో విశ్వవిద్యాలయ ప్రగతిపథంలో వెళ్తుంటే పనిగట్టుకొని కొన్ని విద్యార్థి సంఘాలు విశ్వవిద్యాలయంపై విషం చిమ్ముతున్నాయన్నారు. నాలుగేళ్లుగా వైవీయూలో కాన్వకేషన్ నిర్వహించలేదని.. అందుకు కారణాలు అనేకం ఉండవచ్చు.. ఇదివరకుపనిచేసిన రెగ్యులర్ వీసీ ఆచార్య చింతా సుధాకర్ కాన్వకేషన్ ప్రక్రియను ప్రారంభించారు. తర్వాత ప్రభుత్వం మారడం, వీసీల మార్పురీత్యా అది ఆగిపోయిందని తెలిపారు. వైవీయూలో డిగ్రీ, పీజీ చేసిన వారు వారి ఉద్యోగ నియామకాలు, పై చదువులు, పరిశోధనలు, విదేశాలకు వెళ్లడం ఇత్యాధి కారాణాలతో కాన్వకేషన్ నిర్వహించాలంటూ విద్యార్థి సంఘాలుసైతం కోరాయన్నారు. ఈ నేపథ్యంలో గౌరవ రాష్ట్ర గవర్నర్‌ను కలిసి అనుమతి తీసుకొని ప్రక్రియను ప్రారంభించామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కల్యాణ ఉత్సవ విగ్రహాలకు పూజలు


ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వీరబ్రహ్మేంద్రస్వామి సమేత గోవిందమాంబల కల్యాణ ఉత్సవ విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. దేవస్థాన ఆస్థాన పండితులు ఇడమకంటి జనార్దనచార్యుల ఆధ్వర్యంలో దేవస్థాన ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ పర్యవేక్షణలో సోమవారం ఉదయం 9గంటల నుంచి కల్యాణ మండపంలో కలశస్థాపన నిర్వహించి హోమాలు చేపట్టారు. మధ్యాహ్నం 11కు గోపూజ నిర్వహించి ప్రదక్షిణలు చేపట్టారు. కల్యాణ మహోత్సవంలో భాగంగా నూతన కల్యాణ విగ్రహమూర్తుల మహా సంప్రోక్షణ సందర్భంగా దాతలు బెంగుళూరుకు చెందిన గౌరీశంకరాచారి, పద్మావతమ్మ దంపతులు, రవికుమార్, నళినాక్షి దంపతులు గోపూజ కార్యక్రమం చేపట్టారు. అలాగే నూతన కల్యాణ భవనంలో హోమాలు చేశారు. ఈసందర్భంగా ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ మాట్లాడుతూ లోక కళ్యాణార్థం ఆగస్టు 6న గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి మాస కళ్యాణోత్సవం ప్రారంభమై 2027 జూలై వరకు ప్రతి నెల జరుగుతూనే ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మేనేజరు ఈశ్వరాచారి, వేదపండితులు, కళ్యాణ మహోత్సవ దాతలు పాల్గొన్నారు.

ఈశ్వరీమాత ఆలయ పునర్నిర్మాణానికి రూ.3,72,117లు విరాళం


విరాళమిచ్చిన దాతలు ప్రవీణ్‌కుమార్ దంపతులు, పూజలు చేస్తున్న పేరుసోముల గురుప్రసాద్

బ్రహ్మంగారిమఠం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మనువరాలు జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారి ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు రూ.3,72,117లు విరాళం అందించినట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. సోమిశెట్టి ప్రవీణ్‌కుమార్ సతీమణి అశ్విని రూ.2లక్షలు విరాళం అందించారు. అలాగే అనంతపురానికి చెందిన సీనియర్ న్యాయవాది పేరుసోముల గురుప్రసాద్ రూ.లక్ష, బ్రహ్మంగారిమఠం మండలం కందిమల్లయ్యపల్లె గ్రామం పాతూరు గ్రామ నివాశి రిటైర్డ్ తెలుగు అధ్యాపకుడు ముచ్చర్ల శేషయ్య రూ.72,117లు ఈశ్వరీదేవి మఠం మఠాధిపతి వీరశివకుమారస్వామికి చెక్కులు అందించినట్లు కార్యనిర్వాహక అధికారి తెలిపారు.

'ట్రిపుల్‌ఐటి క్యాంటీన్లను అక్షయపాత్రకు ఇవ్వడం తగదు'

కడపసెవెన్ రోడ్స్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న ట్రిపుల్‌ఐటీలలో విద్యార్థులకు సంబంధించిన క్యాంటీన్లను అక్షయపాత్రకిచ్చే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆప్కాస్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్రప్రధాన కార్య దర్శి పి.వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులకు నిర్వహించే క్యాంటీన్లలో లోపాలు ఉన్నాయన్న పేరుతో అక్షయపాత్ర అనే సంస్థకు అప్పగించడంలోనే పెద్ద మతలబు ఉందన్నారు. ఇపుడు నిర్వహణ చేస్తున్న నిర్వాహకులకు ఒక విద్యార్థికి రోజుకు రూ.90మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. ఇపుడు అక్షయపాత్రకు సంస్థకు రూ.120 ఇవ్వాలని చూస్తున్నారన్నారు. దీని వెనుక అంతర్యమేమిటన్నారు. రాష్ట్రం మొత్తం ఒక వ్యక్తి నిర్వహణ చేయడం వల్ల వారికి ప్రభుత్వంలో ఉన్న పెద్దలకి దగ్గర సంబంధాలు ఉంటాయన్నారు. దీంతో నాణ్యత లోపించే అవకాశం ఉందన్నారు. ట్రిపుల్‌ఐటీలలో క్యాంటీన్లను అక్షయ పాత్రకిచ్చేనిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వారు కోరారు.

సింగిల్ విండో అధ్యక్షుడిగా యల్లెల రెడ్డప్ప రెడ్డి



సింగిల్ విండో చైర్మన్‌గా ప్రమాణం చేస్తున్న యల్లెల రెడ్డప్ప రెడ్డి

పీలేరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పీలేరు సింగిల్ విండో అధ్యక్షుడిగా యల్లెల రెడ్డప్ప రెడ్డి, డైరెక్టర్లుగా పుల్లయ్య, అమానుల్లా సోమవారం ప్రమాణం చేశారు. అట్టహాసంగా జరిగిన కార్యక్రమానికి ముందు కూటమి శ్రేణులు బాణసంచా పేలుళ్లు, గ్రామీణ కళాకారుల చెక్కభజనలు, కోలాటాలతో పండుగ వాతావరణంలో చిత్తూరు రోడ్డు నుంచి తిరుపతి రోడ్డులోని సింగిల్ విండో కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రైవేటు కల్యాణ మండపంలో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్న పథకాలను ఇంటింటికీ వెళ్లి తెలియజేయాల్సిన బాధ్యత కూటమి శ్రేణులపై ఉందన్నారు. జిల్లా సహకార బ్యాంకు సహకారంతో పీలేరు సింగిల్ విండో ద్వారా మండలంలోని రైతాంగానికి సబ్సిడీ రుణాలను పెద్దఎత్తున అందజేస్తామన్నారు. యల్లెల రెడ్డప్ప రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనకు రెండోసారి సింగిల్ విండో అధ్యక్ష పదవి అప్పగించిన ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పీలేరు మండల రైతాంగం అభివృద్ధి కోసం కృషి చేస్తానని, జిల్లా సహకార బ్యాంకు, ప్రభుత్వం ద్వారా రైతులకు సబ్సిడీ రుణాలు, యాంత్రీకరణ పనిముట్లు అందిస్తామన్నారు. అనంతరం సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, డైరెక్టర్లు పుల్లయ్య, అమానుల్లాను కూటమి నేతలు, ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగులు, కార్మిక సంఘ నేతలు అభినందించారు. కార్యక్రమంలో పీలేరు, కేవీపల్లె, కలకడ, కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ మండలాల నేతలు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ ఫలాలు : ఎమ్మెల్యే

నిమ్మనపల్లి ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించనున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కొత్తగా మంజూరైన 97 వితంతు పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దాదాపు 90శాతానికి పైగా పూర్తి చేసిందన్నారు. గ్రామీణ రోడ్లకు మహర్దశ కల్పిస్తున్నామని, తాగునీరు, కూలీలకు ఉపాధిహామీతో ఆదుకుంటోందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు వెంకటరమణ, మునిరత్నం, ఆర్వే వెంకటేష్, విజయ్, చినబాబు, సుధాకర్‌రావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో పారిన మద్యం సొమ్ము

● వేడుకగా కలికిరి, కలకడ సింగిల్ విండో అధ్యక్షుల ప్రమాణోత్సవం

రూ.95 కోట్లకు లెక్కలున్నాయి ● ఎన్నికలైన తర్వాత మొదటి సారి విరుచుకు పడిన ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి





కలికిరి సభలో ప్రమాణం చేస్తున్న సింగిల్‌విండో అధ్యక్షుడు చంద్రకుమార్ రెడ్డి

బాధ్యతలు స్వీకరిస్తున్న కలకడ సింగిల్‌విండో అధ్యక్షుడు మద్దిపట్ల వెంకటరమణనాయుడు

కలికిరి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మొన్నటి ఎన్నికల్లో పీలేరు నియోజకవర్గంలో అక్రమ మద్యం సొమ్ము పారిందని, తనను ఓడించడానికి అక్రమంగా సంపాదించిన రూ.95 కోట్లు ఖర్చు పెట్టారని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. దీనికి సంబంధించిన లెక్కలన్నీ తన వద్ద వున్నాయని ఆయన స్పష్టం చేశారు. సోమవారం కలికిరి సింగిల్ విండోకు నల్లారి చంద్రకుమార్ రెడ్డి అధ్యక్షుడిగా నామినేట్ అయిన త్రీమెన్ కమిటీ సభ్యుల ప్రమాణోత్సవ సభలో ఎన్నికలైన తరువాత మొదటిసారి ప్రత్యర్థి ఎంపీ మిథున్ రెడ్డిపైన విమర్శనాస్త్రాలు సంధించారు. అంగళ్లు కేసులో తనతోపాటు నియోజకవర్గానికి చెందిన 143 మందిపై అక్రమంగా కేసులు పెట్టారని దుయ్యబట్టారు. హైకోర్టులో తమకు ముందస్తు బెయిలు లభించినా తిరిగి ప్రభుత్వం రూ.లక్షలు ఖర్చు చేసి సుప్రీం కోర్టుకు వెళ్లిందని గుర్తు చేశారు. ఎన్నికల సందర్భంగా నియోజకవర్గంలోని టీడీపీ నేతలను కట్టడి చేసేందుకు తమందరి మీద అన్యాయంగా ఆయుధాల చట్టం, 307 సెక్షను కింద కేసులు పెట్టారని ఆయన వివరించారు. అరెస్టు కాకుండా రెండు మూడు నెలలు తప్పించుకు తిరిగామని, ఎన్ని వేధింపులకు గురిచేసినా టీడీపీ నేతలు నిలదొక్కుకున్నారని విశదీకరించారు. బెదిరించో, భయపెట్టో రాజకీయం చేయడాన్ని తమ కుటుంబం ఎప్పుడూ ప్రోత్సహించదన్నారు. న్యాయబద్ధంగా సంపాదించుకునే అవకాశముంటే తాను పూర్తిగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అధ్యక్షుడిగా నల్లారి చంద్రకుమార్ రెడ్డి, సభ్యులుగా అల్లాబక్ష్, సుబ్బయ్య ప్రమాణం చేసి బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో ఏఎంసీ అధ్యక్షుడు మాలతి, చంద్రమౌళి, రామమూర్తి, ఉపాధ్యక్షుడు సనావుల్లా, వివిధ సింగిల్ విండో అధ్యక్షులు సునీల్‌కుమార్ రెడ్డి, సురేష్ రెడ్డి, కృష్ణారెడ్డి, మూర్తిరావు, మండల టీడీపీ అధ్యక్షులు నిజాముద్దీన్, శ్రీకాంత్ రెడ్డి, నాయని జగదీష్, మల్లికార్జున రెడ్డి, మాజీ ఏఎంసీ అధ్యక్షుడు నిరంజన్ రెడ్డి, నేతలు నల్లారి లక్ష్మీకర్ రెడ్డి, నల్లారి మారుతీ రెడ్డి, మాజీ ఎంపీపీ నాగభూషణ రెడ్డి, రాజంపేట ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరువును శాశ్వతంగా నివారిస్తాం

కలకడ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో హంద్రీనీవా ద్వారా నీరు పారించి నియోజకవర్గంలో కరువును శాశ్వతంగా నివారిస్తామని ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి అన్నారు. కలకడలో జరిగిన పీఏసీఎస్ త్రీమెన్ కమిటీ ప్రమాణ సభలో ఆయన మాట్లాడుతూ సీఎం ప్రత్యేక శ్రద్ధతో నిధులు కేటాయించడంతో గండికోట నుంచి ఆరు మండలాల ప్రజలకు రెండేళ్లలో తాగునీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. నేతలు సాయి లోకేష్, మల్లారపు రవిప్రకాశ్‌నాయుడు, మద్దిపట్ల సూర్యప్రకాశ్, వంగిమళ్ల మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్ నాయుడు, బరకం శ్రీనివాసులనాయుడు, మల్లికార్జున నాయుడు, కోట రమణ, కోనేని ఆనంద్ కుమార్, వసంతనాయుడు, బివిస్వామి, కాంతారావు, పొత్తూరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన అధ్యక్షుడు

కలకడ సింగిల్‌విండో అధ్యక్షుడిగా మద్దిపట్ల వెంకటరమణ నాయుడు సోమవారం బాధ్యతలను స్వీకరించారు. ఆయనతో పాటు సభ్యులుగా గిరిజమ్మ, ఎం.వెంకటరమణ బాధ్యతలు స్వీకరించారు. నూతన కార్యవర్గాన్ని పలువురు కూటమి నాయకులు, రైతులు సన్మానించారు.

దంచికొట్టిన వర్షం



కుండపోతగా కురుస్తున్న వర్షం

వాల్మీకిపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నెలరోజులుగా ఊరిస్తున్న మేఘాలు సోమవారం సాయంత్రం ఒక్కసారిగా కుండపోత వర్షం కురిసింది. సాయంత్రం 5.30 గంటల నుంచి భారీ వర్షం కురవడం పట్టణంలోని రోడ్లపై నీటి ప్రవాహాలు పోటెత్తాయి. ఉదయం నుంచీ ఉక్కపోతతో అల్లాడుతున్నజనానికి కాసింత ఉపశమనం లభించినట్లైంది.

ప్రకృతి వ్యవసాయంపై నేడు అవగాహన సదస్సు

పీలేరు రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంపై మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏడీఏ వై.వీ. రమణరావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీ కమ్యూనిటీ మేనేజ్‌మెంట్ నేచురల్ ఫార్మింగ్(ఏపీసీఎన్ఎఫ్) కార్యక్రమంలో భాగంగా దొడ్డిపల్లె రైతు సేవాకేంద్రంలో డివిజన్ స్థాయి సమావేశం జరుగుతుందని తెలిపారు. పీలేరు, కేవీపల్లె మండలాల రైతు సేవా కేంద్రం, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొనాలన్నారు.

సేవచేసే డీలరే ఉండాలి

● ఎమ్మెల్యేకు ప్రజల వినతి

మదనపల్లె టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సకాలంలో స్టోర్ తెరిచి, ప్రజలకు సేవలందిస్తున్న డీలర్‌నే కొనసాగించాలని అనపగుట్ట ప్రజలు ఎమ్మెల్యేకు విన్నవించారు. సోమవారం ఎమ్మెల్యే నివాసం వద్దకు 200 మందికిపైగా అనపగుట్ట ప్రజలు వచ్చారు. వారు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ ఒకటో వార్డులో డీలర్ నందిని ఎనిమిదేళ్లుగా సక్రమంగా నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్నారన్నారు. అయితే ఆమెను తొలగించి, మరొకరికి డీలర్‌షిప్ ఇప్పించేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ 1,050 కార్డులు వున్నా సకాలంలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న డీలర్‌నే కొనసాగించాలని సీఎస్ డీటీ ఫిరోజ్‌ఖాన్‌కు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, మల్లికార్జుననాయుడు, డాన్స్ రెడ్డెప్ప, ప్రజలు పాల్గొన్నారు.

15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం

మదనపల్లె అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఈ నెల 15 నుంచి ఆర్టీసీలో ఉచిత ప్రయాణ పథకం ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి పి.రాము తెలిపారు. సోమవారం మదనపల్లె ఆర్టీసీ డిపోలను ఆయన సందర్శించి నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత ప్రయాణ పథకం అమలవుతున్న సందర్భంగా బస్సులన్నీ కండీషన్‌లో ఉంచాలన్నారు. సిబ్బంది సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రయాణీకుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. వీఆప్‌టీ టికెట్ ఇచ్చే విధానంపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి, అసిస్టెంట్ మేనేజరు రేవతి, ఎంఎఫ్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

పథకం డబ్బు ఇప్పించాలని వినతి

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ డబ్బు అందించి ఆదుకోవాలని ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. పీటీఎం కోటవీధి వాసి రైతు శేషాద్రి వెంకట్రమణ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తన పేరుతో 42 సెంట్ల భూమి వ్యవసాయ భూమి ఉందని, తనకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా డబ్బు జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో తన పేరు మీద ఉన్న భూమికి రైతు భరోసా కింద డబ్బు జమ అయ్యేదని, వైసీపీ ప్రభుత్వంలో భూములను రీసర్వే చేయడంతో తన పేరుతో ఉన్న భూమి వివరాలు అగ్రికల్చర్ సైట్‌లో భూమి లేదని చూపిస్తోందని, దానిని సరి చేయాలని అధికారుల చుట్టూ తిరిగినా వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నగదు జమ అయ్యేలా చూడాలని కోరుతున్నాడు.

పారిశుధ్య కార్మికులతో వైద్య సేవలు

● సోషల్ మీడియాలో వైరల్

పీలేరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పీలేరు ప్రభుత్వ ఆస్పత్రిలో పారిశుధ్య కార్మికులతో వైద్యం చేయిస్తున్నారంటూ సామాజిక మాధ్యమాల్లో సోమవారం ఓ ఫొటో చక్కర్లు కొట్టింది. ఆస్పత్రిలోని ఓ మహిళా రోగికి పారిశుధ్య కార్మికురాలితో సెలైన్ పెట్టిస్తున్నారని ఆరోపిస్తూ ఓఫొటో హల్‌చల్ చేసింది. దీంతో ప్రజా, విద్యార్థి సంఘాలు ప్రభుత్వ ఆస్పత్రి నిర్వహణపై అనుమానాలు వ్యక్తం చేస్తూ పోస్టులు పెట్టారు. ఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్ స్పందిస్తూ ఆ ఫొటో గత నెలలో తీసిందని, ఓ మహిళా రోగికి సెలైన్ బాటిల్ తీసేసిన తరువాత రక్తం కారుతుండడంతో వార్డులో పనిచేస్తున్న కార్మికురాలు కాటన్ తెచ్చి రక్తం కారకుండా పెట్టుకోమని చెప్పిందన్నారు. అప్పటి ఫొటోను ఇలా చిత్రీకరించారని వివరించారు.



సామాజిక మాధ్యమాల్లో వైరలైన పారిశుధ్య కార్మికురాలి ఫొటో

బెల్టు జోరు.. ప్రజల బేజారు...

ఊరూరా వెలసిన బెల్టు దుకాణాలు ● విచ్చల విడిగా గ్రామాల్లో మద్యం అమ్మకాలు

● మామూళ్ల మత్తులో జోగుతున్న పోలీసులు



కందుకూరు శివారులో అక్రమంగా నిర్వహిస్తున్న డాబా

పెద్దతిప్పసముద్రం ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంకా వైసీపీ పాలన సాగుతోందనిపిస్తోంది. వైసీపీ పాలకులు నాణ్యమైన మద్యం అందించక పోగా ఎక్కడ పడితే అక్కడ మద్యం దొరికేలా బెల్టుషాపులు నిర్వహించేవారు. అప్పట్లో కర్ణాటక రాష్ట్రం మద్యం మండలంలో దొరికేది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో బెల్టు షాపులకు అవకాశం ఇవ్వమని పాలకులు పదేపదే ప్రకటిస్తున్నారు. దీంతో గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా ఉండవచ్చని అనుకున్నారు. అయితే పెద్దతిప్పసముద్రం మండలంలో బెల్టుషాపులు మూడు పువ్వులు ఆరుకాయలుగా విరాజిల్లుతోంది. గ్రామాల్లో బెల్టు దుకాణాలు లేకుండా చేస్తామన్న మాట కలగానే మిగిలిపోయింది. బెల్టు దుకాణాలను అరికట్టాల్సిన పోలీస్, ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. దీంతో బెల్టుషాపు నిర్వాహకులకు మరింత ఊతం కలిగినట్లైంది. దీంతో గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపుల ద్వారా మద్యం అమ్మకాలు జోరందుకున్నాయి. పెద్దతిప్పసముద్రం మండలానికి ప్రభుత్వం రెండు మద్యం దుకాణాలను కేటాయించింది. ఒక్కటి స్థానిక మండల కేంద్రమైన పీటీఎంలో ఏర్పాటు చేయగా మరో దుకాణాన్ని కర్ణాటక సరిహద్దు గ్రామం చెన్నరాయునిపల్లె వద్ద ఏర్పాటు చేసుకున్నారు. మద్యం షాపు యాజమానులు కుమ్మక్కై గ్రామానికి రెండుమూడు మద్యం బెల్టు షాపుల ఏర్పాటుతో ఆయా గ్రామాల్లో టీడీపీ నేతల మధ్య ఘర్షణలు చెలరేగుతున్నాయని సీనియర్ టీడీపీ నేతలు వాపోతున్నారు. మద్యం షాపు యాజమానులు ఒకే గ్రామంలో ముగ్గురు నలుగురికి బెల్టు షాపులను కేటాయిస్తూ సొమ్ము చేసుకుంటూ గ్రామాల్లో చిచ్చు పెడుతున్నారు. గ్రామాల్లో విచ్చల విడిగా మద్యం విక్రయిస్తున్నా పోలీసులు మాత్రం నెలవారీ మామూళ్లు తీసుకుని మిన్నకుండి పోతున్నారనే విమర్శలున్నాయి. గ్రామాల్లో విచ్చల విడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. మద్యం ప్రియులు ఎక్కడైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే పోలీసులు హడావుడిగా వారిని పట్టుకుని జరిమానా విధిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కందుకూరు గ్రామ శివారుల్లో కొత్తగా ఏర్పాటు చేసిన డాబాలో యదేచ్ఛగా మద్యం విక్రయిస్తున్నా పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇటీవల స్థానిక పీటీఎంలోని మద్యం షాపు వద్ద అతిగా మద్యం తాగి పీటీఎం వాసి బుర్రా రామకృష్ణ మృతి చెందినా గుట్టు చప్పుడు కాకుండా దహనక్రియలు నిర్వహించేలా పోలీసులు, మద్యం షాపు యాజమానులు వారి కుటుంబ సభ్యులపై ఒత్తిడి తెచ్చి పనిముగించారు. ఇప్పటి కైనా సంబంధిత అధికారులు గ్రామాల్లో విచ్చల విడిగా అమ్ముతున్న బెల్టు షాపులపై చర్యలు తీసుకుని బెల్టు షాపులను కట్టడి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంలో ఎస్ఐ హరిహర ప్రసాద్ వివరణ ఇస్తూ బెల్టు షాపులు నిర్వహిస్తున్నట్లు సమాచారం లేదు. అయితే ఎవరైనా సమాచారం అందిస్తే చర్యలు చేపడతాం.

వైభవంగా వీరభద్రుడి విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలు



ఆలయంలో నిర్వహిస్తున్న హోమం

తంబళ్లపల్లె ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): చిన్నమాచిరెడ్డిగారిపల్లెలో కొత్తగా నిర్మించిన వీరభద్ర స్వామి ఆలయంలో మూడు రోజులుగా విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలను కన్నెమడుగు దాయాదులు, గ్రామస్తులు వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ విఘ్నేశ్వరపూజ, యాజమాన సంకల్పం, పంచగవ్యం, యాగశాల పూజ, రెండోకాల హోమం, గణపతి, మూర్తిహోమం, కళాహోమం, స్వర్ణాపూజలు, చేసి ప్రాణప్రతిష్ఠ చేశారు. మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, విగ్రహ ప్రతిష్ఠాపన, కుంభాభిషేకాల్లో పాల్గొన్నారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయం వద్ద భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు.

దారులను మూసేస్తున్నారు.. పట్టించుకోండి సార్



ప్రజల సమస్యలు వింటున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాలుగా నివసిస్తున్న కాలనీలకు వెళ్లనీయకుండా కొందరు దారులను మూసేస్తున్నారని, మీరైనా పట్టించుకోండి సార్ అంటూ మదనపల్లె మండలం దుబ్బిగానిపల్లె, పొన్నేటిపాళెం పంచాయతీ చిప్పిలి గ్రామాల ప్రజలు సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు విన్నవించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 82 మంది అర్జీలు సమర్పించారు. ఇందులో చిప్పిలి సర్వేనెంబర్68/2లో సామాజిక అవసరాలకు వదిలేసిన భూమిని తాము దారిగా ఉపయోగించుకుంటుంటే ముగ్గురు వ్యక్తులు ఆ దారిని మూసివేశారని ఫిర్యాదు చేశారు. దుబ్బిగానిపల్లె పంచాయతీ ఆర్‌సీ వడ్డిపల్లెలో ప్రజలు నడుస్తున్న దారిని ఇద్దరు వ్యక్తులు ఆక్రమించి గోడ కట్టి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను విచారించి తగు సమయంలో ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని సంబంధిత శాఖ అధికారులను సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

కల్తీ లేనిది తల్లిపాలే...



గండబోయనపల్లెలో తల్లిపాల అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

వాల్మీకిపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డకు ఏమాత్రం కల్తీ లేకుండా లభించేది ఒక్క తల్లిపాలు మాత్రమేనని చింతపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారి జులేఖాబేగం పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం వైద్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ర్యాలీలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. గండబోయనపల్లె అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ తల్లిపాలకు ప్రత్యామ్నాయం లేదని తల్లిపాలు శిశువుకు దేవు డు ఇచ్చిన వరమన్నారు. బిడ్డ పుట్టిన అరగంటలోపే బిడ్డకు ముర్రుపాలు ఇవ్వడం ఆరోగ్యకరమన్నారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్ రఫీ, సీహెచ్ఓ అరుణ, వైద్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆలయం నిర్మాణం

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పుట్టి పెరిగిన గ్రామంలో దేవకి కుటుంబం ఆలయం నిర్మించింది. వినసక్రవాండ్లపల్లెలో ఆర్యవైశ్య కులస్థులు దేవకి కుటుంబం పూర్వీకులంతా ఇక్కడే ఉండే వారు. కాలక్రమేణా వారు గ్రామాన్ని వదిలి పట్టణాలకు వెళ్లారు. ఇందులో దేవకి కుటుంబ సభ్యుల్లో ఒక్కరైన దేవకి విశ్వనాథశెట్టి (వినన్న) మదనపల్లెలో స్థిర పడ్డారు. దీంతో పూర్వీకుల జ్ఞాపకార్థం శిథిలా వస్థలో ఉన్న మారెమ్మ, గంగమ్మ, ఆలయాన్ని సొంత నిధులతోనే నిర్మించారు.

మల్లయ్యకొండలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మల్లికార్జున స్వామి

తంబళ్లపల్లె ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లయ్యకొండకు సోమవారం అశేషంగా తరలి వచ్చిన భక్తుల శివనామస్మరణలతో మార్మోగింది. రాయలసీమ జిల్లాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల భక్తులు కుటుంబ సమేతంగా మల్ల య్యకొండకు వచ్చి భ్రమరాంబ మల్లికార్జున స్వాముల వారిని దర్శించుకున్నారు. ఆలయ పూజారి ఈశ్వరప్ప మల్లికార్జునస్వామి వారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కొండపైన గౌరమ్మ, అమ్మవారికి, ఏనుగుమల్లమ్మకు ప్రత్యేకపూజలు నిర్వ హించారు. ఆలయ ఈఓ మునిరాజ అధ్వర్యంలో కొండపై భక్తులకు అన్నదానం చేశారు.

వైభవంగా నారవమాను గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ అమ్మవారు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పనస మాకులపల్లెలో నారవమాను గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజల అనంతరం మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం చేశారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాంచినబాబు, ఎమ్మెల్యే షాజహాన్ బాషా, రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు శేషాచలపతి నాయుడు, మల్లయ్యకొండ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి, చిప్పిలి సర్పంచ్ పసుపులేటి చలపతి, ప్రముఖులు గంగమ్మ విగ్రహప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని గంగమ్మను దర్శించుకున్నారు. టీడీపీ నేత ద్వారస్వామినాయుడు, మాజీ ఎంపీటీసీ మల్లికార్జున, జన్నే సుబ్బానాయుడు, రాజశేఖర్, భాస్కర్, చిప్పిలి చెంగ్రాయుడు, జేకే నాయుడు, సుగుణ, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో సంగీతం భాగస్వామ్యం కావాలి



మ్యూజిక్ అకాడమీని ప్రారంభించి గిటార్ వాయిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, బీజేపీ నేతలు

మదనపల్లె టౌన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరి జీవితంలో సంగీతం భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. సోమవారం స్థానిక సొసైటీ కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన విజయభారతి మ్యూజిక్ అకాడమీని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ దైనందిన కార్యక్రమాల్లో అలసిపోతున్న మనసు, శరీరాలకు సంగీతం గొప్ప సాంత్వన కలిగిస్తుందన్నారు. మదనపల్లెలో అన్ని వాయిద్యాలతో ఏర్పాటు చేసిన మ్యూజిక్ అకాడమీని విద్యార్థులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మ్యూజిక్ అకాడమీ నిర్వాహకులు ఎన్.సేతు, బీజేపీ, టీడీపీ నేతలు నరసింహారెడ్డి, అజంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమ పథకాల్లో ఏపీ ఆదర్శం

రామసముద్రం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. వితంతుల పింఛన్ పంపిణీలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నికల ముందు ప్రజా సంక్షేమం కోసం సూపర్‌సిక్స్ పథకాల హామీలు ఇచ్చి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ఎనభై శాతం పథకాలు అమలు చేసిన ఘనత టీడీపీ ప్రభుత్వానికే చెల్లుతుందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడానికి, పీ4 విధానాన్ని అమలు పరుస్తూ రాష్ట్రంలో అనేక విదేశీ కంపెనీలు పెట్టుబడులు పెట్టేలా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గఫూర్, మాజీ జడ్పీటీసీ మునివెంకటస్వామి, ఏపీ మోడల్ స్కూల్ చైర్మన్ బాలాజీ, స్థానికం రాజేష్, శివారెడ్డి, రామమూర్తి, వెంకటేష్, జావీద్, రమేష్ నడింపల్లి, అధిక సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేడుకగా యోగనేలమల్లేశ్వరుడి ప్రాణ ప్రతిష్ఠ



ప్రత్యేక అలంకరణలో యోగనేలమల్లేశ్వర స్వామి

నిమ్మనపల్లి ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తవళం అటవీ ప్రాంతంలో వెలసిన యోగనేలమల్లేశ్వరస్వామి ప్రాణ ప్రతిష్ఠ వేడుకగా నిర్వహించారు. ఏఓ మంజుల, చైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ స్వామి వారికి బాహుదా నదీ జలాలను తెచ్చి జలహారతి ఇచ్చి స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేల ఏళ్ల కిందట బాహుదా నది ఒడ్డున మల్లెపొదల్లో స్వయంభూ లింగం పశువులకాపరి కంట పడడంతో అప్పటి నుంచి శివలింగం వున్న చోట ఆలయం నిర్మించి నేల నుంచి పుట్టినందుకు నేలమల్లేశ్వస్వామిగా పిలవబడుతోంది. గర్భ గుడి పూర్తవడంతో మళ్లీ స్వామి వారి దర్శనభాగ్యానికి అనుమతించారు. దాదాపు మూడు రోజులు హోమాలు, ప్రత్యేక పూజలు చేసి వేద పండితులచే నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. అనంతరం స్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించా రు. చివరి రోజు బయటి ప్రాంతాల నుంచి సైతం భక్తులు హజరై స్వామి వారి కృపా కటాక్షాలు పొందారు.

అన్నదానం చేసిన గుత్తాహరిక్రిష్ణ దంపతులు

యోగనేలమల్లేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజులుగా పలు కార్యక్రమాలకు వచ్చే భక్తులకు బీజేపీ నేత గుత్తా హరికృష్ణ, లీలావతి దంపతులు ఉదయం టిఫన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజన వసతులు కల్పించారు. కార్యక్రమంలో మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, సర్పంచ్ రెడ్డెప్ప, మునిరత్నం, మురళి, రాజన్న, కార్యదర్శి గౌతమి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పది లోపు దరఖాస్తు చేసుకోండి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వలసపల్లె జవహర్ నవోదయ విద్యాలయంలో ఈ విద్యా సంవత్సరానికి టెన్త్ పాస్ అయిన విద్యార్థులు ఇంటర్‌లో ఉన్న ఖాళీ సీట్లను భర్తీ చేస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గీత ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసిన ఫారంను 10వ తేదీ లోపు సమర్పించాలన్నారు.